# పంచగ్రంథము

తొమ్మిదవ పాఠం

## పితరుడైన యాకోబు

Manuscript

thirdmill
Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీక్షలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# విషయ సూచిక

ఉపోద్ఘాతం ...... 1
నిర్మాణము మరియు విషయములు ...... 2
సంఘర్షణ యొక్క ఆరంభము (ఆదికాండము 25:19-34) ...... 4
సంఘర్షణకు ముగింపు (35:16-37:1) ...... 7
ఇస్సాకు మరియు ఫిలిష్తీయులు (ఆదికాండము 26:1-33) ...... 7
యాకోబు మరియు కనానీయులు (33:18-35:15) ...... 8
వైరముతో కూడిన ఎడబాటు (ఆది. 26:34-28:22) ...... 9
సమాధానకరమైన ఎడబాటు (ఆది. 32:1-32:17) ...... 10
లాబానుతో గడిపిన సమయం (ఆది. 29:1-31:55) ...... 11
ముఖ్య అంశములు ...... 12
దేవుడు ఇశ్రాయేలుకు చూపిన కృప ...... 13
వాస్తవిక అర్థము ...... 13
ఆధునిక అనువర్తనము ...... 16
దేవునికి ఇశ్రాయేలు చూపిన స్వామిభక్తి ...... 17
వాస్తవిక అర్థము ...... 17
ఆధునిక అనువర్తనము ...... 20
ఇశ్రాయేలుకు దేవుని ఆశీర్వాదములు ...... 21
వాస్తవిక అర్థము ...... 22
ఆధునిక అనువర్తనము ...... 23
ఇశ్రాయేలు ద్వారా ఆశీర్వాదములు ...... 23
వాస్తవిక అర్థము ...... 24
ఆధునిక అనువర్తనము ...... 26
ముగింపు ...... 27



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## ఉపోద్ఘాతం

అసలు మార్పు పొందుటకు అవకాశమేలేని మోసగాళ్లను మీరెప్పుడైనా చూశారా? వారి మోసము మరియు కుట్ర వారికి ప్రయోజనమును కలిగిస్తు — కనీసం కొంత కాలం పాటైనా — వారిని మరింత నీచులుగా చేస్తుంది. కాని సంతోషకరముగా, దేవుడు అట్టి ప్రజలను విశేషమైన రీతులలో ఉపయోగించుకోవాలని కోరినప్పుడు, వారు ఆయనకు అందనంత దూరముగా మాత్రం ఉండరు. వారిని నమ్రపరచి, ఆయనను సేవించుటకు సిద్ధముగా ఉన్న ప్రజలుగా వారిని రూపుదిద్దుటకు దేవుడు వారి జీవితములో కొన్ని కష్టములను కలిగిస్తాడు. మరియు చాలాసార్లు, దేవుడు ఈ విధంగా మార్చిన ప్రజలు నమ్రత మరియు విశ్వాసము విషయములో ఇతరులకు మాదిరులుగా మారతారు.

*పంచగ్రంథము*లోని ఈ పాఠం బైబిలులోనే అతి పెద్ద మోసగాడైన, "పితరుడైన యాకోబు"కు అంకితం చేయబడింది. కాని, మనము చూడబోవుచున్నట్లు, 25:19-37:1 వరకు వ్యాపించిన ఆదికాండములోని ఈ భాగము, యాకోబు చేసిన మోసమును మాత్రమే బయలుపరచదుగాని, దేవుడు అతనిని నమ్రపరచి, ఇశ్రాయేలులోనే అత్యంత ప్రియమైన పితరులలో ఒకనిగా తీర్చిదిద్దాడని కూడా బయలుపరుస్తుంది.

ఇతర పాఠములలో, ఆదికాండము గ్రంథము మూడు ప్రధానమైన భాగములుగా విభాగించబడుతుంది అని మనము చూశాము. మొదటి భాగము 1:1-11:9లో ఉన్న ప్రాచీన చరిత్ర. వాగ్దాన దేశము కొరకు ఇశ్రాయేలుకు ఇవ్వబడిన పిలుపు ప్రపంచ చరిత్రలోని ఆరంభ దశలలో జరిగిన సన్నివేశములలో నాటబడియున్నదని దీనిలో మోషే వివరించాడు. రెండవ భాగము ఆదిమ పితరుల చరిత్రను వివరిస్తుంది మరియు ఇది 11:10-37:1లో ఉన్నది. ఈ భాగములో, వాగ్దాన దేశము వైపుకు ప్రయాణమును అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబుల జీవితముల వెలుగులో చూడాలని మోషే స్పష్టము చేస్తాడు. మూడవ భాగము తరువాతి పితరుల చరిత్రను గూర్చినది, ఇది 37:2-50:26లో ఉన్నది. ఈ వచనములలో, వారు వాగ్దాన దేశము వైపుకు కదులుచుండగా ఇశ్రాయేలు గోత్రముల మధ్య తలెత్తిన సమస్యలను పరిష్కరించుటకు మోషే యోసేపు మరియు అతని సహోదరులను గూర్చిన వృత్తాంతమును తెలియజేశాడు.

పితరుడైన యాకోబును గూర్చిన నివేదిక రెండవ భాగమునకు చెందినది; ఇశ్రాయేలు యొక్క సుపరిచితులైన ముగ్గురు పితరులను గూర్చిన ఆదిమ పితరుల చరిత్ర: అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు. ఇస్సాకు జీవితములోని సన్నివేశములు 11:10-25:18లో ఉన్న అబ్రాహాము యొక్క నివేదికతో, మరియు 25:19-27:1లో ఉన్న యాకోబు యొక్క నివేదికతో ముడిపడియున్నాయి. కాబట్టి, ఈ పాఠంలో, ఈ విభజన యొక్క రెండవ భాగము మీద మనము దృష్టిపెడదాము: యాకోబు జీవితము.

పితరుడైన యాకోబును గూర్చిన మన పాఠం రెండు ప్రధానమైన భాగములుగా విభాగించబడుతుంది. మొదటిగా, ఆదికాండములోని ఈ భాగము యొక్క నిర్మాణమును మరియు విషయములను పరీక్షిద్దాము. తరువాత మోషే తన వాస్తవిక శ్రోతల కొరకు ఉద్ఘాటించిన ముఖ్య

అంశములను, మరియు ఆ అంశములు ఆధునిక క్రైస్తవులకు ఎలా అనువర్తించబడతాయో చూద్దాము. యాకోబు వృత్తాంతము యొక్క నిర్మాణము మరియు విషయములతో ఆరంభిద్దాము.

## నిర్మాణము మరియు విషయములు

యాకోబు జీవితములో జరిగిన సన్నివేశములను గూర్చి ఇంచుమించు బైబిలు విద్యార్థులందరికీ తెలుసు. కాని ఈ పాఠంలో, ఆదికాండము పుస్తకములో మోషే ఈ సన్నివేశముల యొక్క నివేదికను అమర్చిన విధానమును ఇప్పుడు చూద్దాము. మనము లేఖనములను చదువునప్పుడు, అవి ఏమి చెబుతున్నాయి మరియు వాటిని ఎలా చెబుతున్నాయి అను విషయములను మనము దృష్టిలో ఉంచుకోవాలని మర్చిపోవద్దు. మరొక మాటలో, ప్రతి వాక్యభాగము యొక్క విషయములు మరియు నిర్మాణము కలసి ఎలా పని చేస్తాయి? ఈ అనుబంధమును అర్థము చేసుకొనుట ద్వారా బైబిలు రచయితలు తమ వాస్తవిక శ్రోతల కొరకు కలిగియుండిన ఉద్దేశ్యములను మనము వివేచించవచ్చు. మరియు వారి వాక్య భాగములను ఆధునిక లోకములో ఎలా అనువర్తించాలో తెలుసుకొనుటలో ఇది మనకు సహాయపడుతుంది.

ఆది. 25:19-37:1 వంటి సుదీర్ఘమైన మరియు సంక్లిష్టమైన లేఖన భాగమునకు ఆకారమునిచ్చుటకు అనేక మార్గములు ఉన్నాయి. కాని, మన ఉద్దేశ్యముల కొరకు, యాకోబు జీవిత వృత్తాంతములోని ఏడు ప్రధానమైన విభాగములను మనము గుర్తిద్దాము.

ఆది. 25:19-34లో ఉన్న మొదటి విభాగమును సంఘర్షణ యొక్క ఆరంభము అని మనము పిలువవచ్చు. ఇది యాకోబు మరియు ఏశావుల మధ్య, తద్వారా వారిలో నుండి వెలువడిన దేశముల మధ్య ఉన్న సంఘర్షణ అను నాటకీయ సమస్యను తెలియజేస్తుంది. యాకోబు జీవిత వృత్తాంతములో ఈ సంఘర్షణ ఆరంభమై తరువాత చల్లారుతుంది. ఈ మొదటి భాగము యాకోబు ఏశావుల నుండి వారి తండ్రియైన ఇస్సాకు మీదికి దృష్టి మళ్లుట ద్వారా ముగుస్తుంది.

26:1-33లో ఉన్న రెండవ విభాగము, ఇస్సాకు మరియు ఫిలిష్తీయుల మధ్య జరిగిన సమాధానకరమైన పాలుపంపులను గూర్చి వివరిస్తుంది. ప్రధానమైన పాత్రలుగా ఏశావు మరియు యాకోబుల మీద మరలా దృష్టి పెట్టుట ద్వారా ఈ విభాగము ముగుస్తుంది.

26:34-28:22లో ఉన్న మూడవ విభాగము, యాకోబు ఏశావులు శత్రుత్వముతో విడిపోవుటను గూర్చి తెలియజేస్తుంది. యాకోబు వాగ్దాన దేశమునకు బయట ఉన్న లాబాను మరియు అతని బంధువుల యొద్దకు వెళ్లుటతో ఈ విభాగము ముగుస్తుంది.

29:1-31:55లో ఉన్న నాల్గవ విభాగము, యాకోబు లాబాను యొద్ద గడిపిన సమయమును వర్ణిస్తుంది. యాకోబు వాగ్దాన భూమికి తిరిగివచ్చుటతో ఈ విభాగము ముగుస్తుంది.

32:1-33:17లో ఉన్న ఐదవ విభాగము, యాకోబు వాగ్దాన భూమికి తిరిగివచ్చిన తరువాత యాకోబు ఏశావుల మధ్య జరిగిన సమాధానకరమైన విభజనను నివేదిస్తుంది. ఈ విభాగము ఏశావు తరువాత యాకోబు కనానీయ విరోధులతో వ్యవహరించిన విధానము మీద దృష్టిపెడుతుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

33:18-35:15లో ఉన్న ఆరవ విభాగము, యాకోబు మరియు కనానీయుల మధ్య జరిగిన సన్నివేశముల మీద దృష్టిపెడుతుంది. ఈ విభాగము యొక్క చివరిలో, యాకోబు వంశావళి మీదికి దృష్టి మళ్లుతుంది.

చివరిగా, 35:16-37:1లో ఉన్న యాకోబు జీవితము యొక్క ఏడవ విభాగము సహోదరుల మధ్య ఉన్న సంఘర్షణ యొక్క ముగింపును తెలియజేస్తుంది.

యాకోబు జీవితము యొక్క ఈ సామన్య ఆకారము ఒక విశాలమైన ఖయాజం లేక మెలికను సృష్టిస్తుందని అనేకమంది వ్యాఖ్యానకర్తలు గుర్తించారు:

> ఒక కేంద్ర విషయమునకు ముందు మరియు తరువాత ఉన్న భాగములు ఒకదానితో మరొకటి సమాంతరముగా లేక సమతుల్యముగా ఉండు ఒక సాహిత్య నిర్మాణము.

> పాత నిబంధనలోని ఒక భాగము యొక్క ఆకారమును గూర్చి మీరు మాట్లాడు ప్రతిసారి, బైబిలు రచయితలు, కొన్ని విశేషమైన సందర్భములు మినహా, ఒక ఆకారమును మనస్సులో ఉంచుకొని తమ వృత్తాంతములను, లేక పద్యములను మరియు మొదలగువాటిని వ్రాయలేదు అని మీరు గుర్తుంచుకోవాలి. "ఇప్పుడు నేను మొదటి భాగమును వ్రాస్తున్నాను. ఇప్పుడు రెండవ భాగమును వ్రాస్తున్నాను. ఇప్పుడు మూడవ భాగమును వ్రాస్తున్నాను" అన్నట్లు. కాని, వ్యాఖ్యానకర్తలు వ్రాయబడిన వాక్యభాగములను చూసి గుర్తించదగిన పద్ధతులను కనుగొనుటను గూర్చి మనము మాట్లాడుతున్నాము, అనగా నిర్మాణము మరియు తార్కిక సంబంధములను విశ్లేషించుటకు ప్రతి ఆకారము కొన్ని అర్హతలను ఉపయోగిస్తుంది. మరియు మీరు ఉపయోగించు అర్హతల ఆధారంగా, మీరు విభిన్నమైన ఆకారములను కనుగొంటారు. సరే, మునుపటి భాగములు మరియు తరువాతి భాగముల మధ్య సమతుల్యతను, లేక ప్రతిబింబములను, లేక సమాంతరాలను కనుగొనుట మీరు ఉపయోగించదగిన ఒక అర్హత అయ్యున్నది ... అయితే మీరు ఇంకా ఎక్కువ సమాంతరతలను — యాకోబు విషయములో మొదటి భాగము మరియు చివరి భాగము మధ్య — కనుగొన్నప్పుడు మీరు ఏ స్థాయికి చేరతారంటే, సరిపడిన సమాంతరతలు ఉన్నట్లయితే, దానిని "ఉద్దేశపూర్వక ఖయాజం" అని పిలువవచ్చు. ఇక్కడ రచయిత ఈ విధంగా ఆలోచన చేస్తాడు, "నేను ఇలా చేశాను. నేను ఇలా చేశాను. మొదటి భాగములో నేను ఇలా చేశాను; మునుపటి భాగముతో కొన్ని సంబంధములు ఉన్న విధంగా నేను ఇప్పుడు ఇలా చేయబోతున్నాను" ... మరియు అట్టి నిర్మాణములో కలుగు ఇలాంటి పరస్పర సంబంధముల కారణంగా, పరస్పర సంబంధం కలిగియున్న భాగములను పోల్చు మరియు వైరుధ్యములు చూపు అవకాశం మీకు లభిస్తుంది. యాకోబు వృత్తాంతము విషయములో ఇదే విలువైనదిగా ఉన్నది. యాకోబు జీవితము యొక్క ఆరంభ సందర్భములు యాకోబు జీవితము యొక్క తరువాత



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> సందర్భములతో సంబంధము కలిగియున్నాయి. మరియు ఈ పరస్పర సంబంధములను — వీటిలో వ్యత్యాసములు ఉన్నాయి మరియు పోలికలు ఉన్నాయి — మీరు చూసినప్పుడు మరియు ఈ రెంటిని మీరు కలిసియుండుట చూసినప్పుడు మరియు ఇవి ఈ రెండు భాగముల మధ్య ప్రత్యక్షమైనప్పుడు, ఈ రెండు భాగములలో రచయితగా మోషే ఏమి ఉద్ఘాటించుచున్నాడో మీరు చూడగలుగుతారు. ఖయాజం యొక్క ప్రాముఖ్యతను అర్థము చేసుకొనుటకు వ్యత్యాసములు మరియు పోలికలు ప్రాముఖ్యమైనవిగా ఉన్నాయి.
>
> — డా. రిచర్డ్ ఎల్. ప్రాట్ట్, జు.

మనము ఇంతకు ముందే చూసినట్లు, యాకోబు వృత్తాంతములోని మొదటి విభాగము సహోదరులైన యాకోబు ఏశావుల మధ్య ఆరంభమైన సంఘర్షణను జ్ఞాపకము చేసుకుంటుంది. సంఘర్షణ యొక్క ముగింపును గూర్చి తెలుపు ఏడవ మరియు చివరి విభాగము ద్వారా ఈ భాగము సమతుల్యము చేయబడింది. ఈ రెండు విభాగములు కేవలం సహోదరుల మధ్య జరిగిన సంఘర్షణ మాత్రమేగాక, వారి నుండి వెలువడిన దేశముల మధ్య సంఘర్షణను గూర్చి కూడా మాట్లాడతాయి.

రెండవ విభాగము ఇస్సాకు మరియు ఫిలిష్తీయుల మధ్య జరిగిన సంకర్షణల మీద దృష్టిపెడుతుంది. ఇది ఆరవ విభాగమునకు అనుసంధానముగా ఉన్నది, అక్కడ మనము యాకోబును మరియు కనానీయులతో అతని సంకర్షణలను చూస్తాము. ఈ విభాగములు పితరులు మరియు వాగ్దాన దేశములో ఉన్న ఇతర గుంపుల మధ్య జరిగిన సంకర్షణలను వర్ణిస్తాయి కాబట్టి ఇవి ఒకదానినొకటి సమతుల్యము చేస్తాయి. మూడవ విభాగము యాకోబు ఏశావుల మధ్య జరిగిన వైరముతో కూడిన ఎడబాటును నమోదు చేస్తుంది. ఇది యాకోబు మరియు ఏశావుల యొక్క సమాధానకరమైన ఎడబాటును వర్ణించు ఐదవ విభాగమును సమతుల్యం చేస్తుంది. స్పష్టముగా, సహోదరులు విడిపోయిన సమయములలో జరిగిన క్రియాశీలకముల మీద ఈ రెండు విభాగములు దృష్టిని పెడతాయి. మరియు చివరిగా, నాల్గవ విభాగము లాబానుతో యాకోబు గడిపిన సమయమును వర్ణిస్తుంది. ఈ విభాగము ఖయాజం నిర్మాణములో ఒంటరిగా వ్రేలాడుతున్నట్లు నిలబడుతుంది. ఈ విధంగా, ఇది యాకోబు వృత్తాంతములో ఒక మలుపును రూపిస్తుంది.

ఈ సౌష్టవ రూపమును మనస్సులో ఉంచుకొని, ప్రతి జతగల విభాగమును పోల్చుట ద్వారా మరియు వ్యత్యాసపరచుట ద్వారా మోషే ఇచ్చిన కథనములోని విషయములను మనము పరీక్షిద్దాము. సౌకర్యముగా ఉండుటకు, మనము బయట ఉన్న విభాగములతో ఆరంభించి, మధ్యలో ఉన్న విభాగము వైపుకు కొనసాగుదాము. ఆది. 25:19-34లో సహోదరుల మధ్య సంఘర్షణ యొక్క ఆరంభమును మొదటిగా చూద్దాము.

## సంఘర్షణ యొక్క ఆరంభము (ఆదికాండము 25:19-34)

ఈ భాగములో సహోదరుల మధ్య సంఘర్షణ ఎలా ఆరంభమైనదో చూపు మూడు సులువైన ఉపాఖ్యానములు ఉన్నాయి. మొదటి ఉపాఖ్యానము కవలలు జన్మించకముందు 25:19-23లో

జరుగుతుంది. కవలలు తల్లి గర్భములో జగడమాడిన విషయమును అది నివేదిస్తుంది. ఆది. 25:23లో, గర్భములో జరిగిన ఈ సంఘర్షణను గూర్చి దేవుడు రిబ్కాకు వివరించిన విధానమును వినండి:

> రెండు జనములు నీ గర్భములో కలవు. రెండు జనపదములు నీ కడుపులోనుండి ప్రత్యేకముగా వచ్చును. ఒక జనపదముకంటె ఒక జనపదము బలిష్టమైయుండును. పెద్దవాడు చిన్నవానికి దాసుడగును అనెను (ఆది. 25:23).

ఇక్కడ మనము చూస్తున్నట్లు, యాకోబు ఏశావుల మధ్య జరిగిన సంఘర్షణ ఇద్దరు సహోదరుల మధ్య జరుగు ఒక వ్యక్తిగత సంఘర్షణ కంటే పెద్దదని దేవుడు సెలవిచ్చాడు. ఇది "రెండు దేశములు" లేక "రెండు జనుముల" మధ్య సంఘర్షణను ఊహించింది. కాబట్టి, దేవుని మనస్సులో ఉండిన ఆ రెండు దేశములు ఏవి? దీనికి జవాబును మనము ఈ భాగములోని రెండవ మరియు మూడవ ఉపాఖ్యానములలో చూస్తాము.

25:24-26లో ఉన్న రెండవ ఉపాఖ్యానము జననమందు సహోదరుల మధ్య జరిగిన సంఘర్షణను గూర్చి చెబుతుంది. ఈ క్లుప్త వాక్యభాగము ఇంతకు ముందు ప్రస్తావించబడిన రెండు దేశములను గూర్చి మొదటి గురుతును ఇస్తుంది. ఆది. 25:25, మొదటి శిశువైన ఏశావును, జననమందు "యెర్రని" అని వర్ణిస్తుంది. "యెర్రని" అను పదమునకు హెబ్రీ పదము *אַדְמֹנִי* (*అద్మోని*). ఈ పదజాలము పదముల తారుమారును సూచిస్తుంది, ఎందుకంటే ఇది *אֱדוֹם* లేక *ఎదోం* వంటి హెబ్రీ పదముల కుటుంబములో నుండి వెలువడుతుంది. ఏశావు ఎదోము దేశమునకు పితరుడైయున్నాడని ఇది సూచిస్తుంది. ఆది. 25:26లో మనము రెండవ దేశమును గూర్చి నేర్చుకుంటాము, అక్కడ రెండవ కుమారుడు యాకోబు అని పిలువబడ్డాడు. అవును, యాకోబు ఇశ్రాయేలు దేశము యొక్క పితరునిగా సుపరిచితుడు.

25:27-34లో ఉన్న మూడవ ఉపాఖ్యానము యౌవ్వనులుగా ఉన్నప్పుడు యాకోబు ఏశావుల మధ్య జరిగిన వైరమును గూర్చి నివేదిస్తుంది. ఈ వచనములలో, "యెర్రయెర్రని కూర" లేక హెబ్రీలో *אָדֹם* (అదోం) కొరకు యాకోబు ఏశావు యొక్క జ్యేష్ఠత్వమును ఇవ్వమని కోరాడు. ఈ హెబ్రీ పదము ఏశావు జననములోని "యెర్రని" అను పదమును ప్రతిధ్వనిస్తుంది. ఇందుమూలముగానే ఏశావు "ఎదోము" అని పిలువబడ్డాడు అని ఆది. 25:30 స్పష్టముగా తెలియజేస్తుంది.

ఇంతకు ముందు మనము చూసినట్లుగా, ఆరంభము నుండే మోషే తన పాఠకులకు తాను వ్రాసిన కథనము పట్ల ఒక కీలకమైన ధోరణిని అందించాడు. యాకోబు మరియు అతని సోదరుడైన ఏశావు మధ్య ఏమి జరిగినదో అతని శ్రోతలు తెలుసుకొనబోవుచుండిరి. అయితే ఇది ఇద్దరు సహోదరుల మధ్య జరిగిన సంఘర్షణ మాత్రమే కాదు. ఈ సహోదరులిద్దరు, ఇశ్రాయేలు మరియు ఎదోము అను రెండు దేశములకు అధిపతులుగా ఉన్నారు, మరియు ఆ విధంగా, ఈ రెండు దేశములలో ఉన్న వారి వారసుల మధ్య సంఘర్షణకు వారి వ్యక్తిగత సంఘర్షణ ముందస్తు సూచనగా ఉన్నది.

> ఇశ్రాయేలు మరియు ఎదోము మధ్య దౌత్య సంబంధములను గూర్చి, రాజకీయ కలయికను గూర్చి, మరియు వారి మధ్య జరిగిన సమన్వయములను గూర్చి మనము ఆలోచన చేసినప్పుడు... రిబ్కా గర్భములో వారు ఉన్నప్పుడు కూడా...



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అది ఒక ఆనందకరమైన అనుబంధము కాదు కదా? వారు జగడమాడారు మరియు ఒకడు మరియొకని అధిగమించుటకు ప్రయత్నించాడు. అవును, ఏశావు మొదటిగా బయటకు వచ్చాడు; కాబట్టి అతడు జ్యేష్టుడు. కాని యాకోబు అతని వెనుకనే ఉన్నాడు మరియు అతడు ఏశావు స్థానమును లాగుకొనగోరాడు, అతని పేరుకు అర్థము కూడా అదే. యాకోబు ఒక "మోసగాడు," కదా? "అన్యాయముగా మరొకని స్థానమును లాగుకొనువాడు." కాబట్టి, ఇది నేపధ్యము. తరువాత యౌవ్వన కాలములో — రెండు వేర్వేరు స్వభావములు — యాకోబు తిని, గుడారము చుట్టు తిరుగుతూ ఇంటి వద్ద ఉండగోరాడు మరియు ఏశావు ఒక వేటగాడు కదా? కాని యాకోబుకు ఏశావు కలిగియున్నది కావాలి, అది జ్యేష్ఠత్వపు హక్కు. కాబట్టి అతడు ఏశావు కొరకు భోజనమును సిద్ధపరచాడు. అతడు ఆకలితో వేట నుండి తిరిగివచ్చి తన సహోదరునితో ఈ మూర్ఖమైన ఒప్పందం చేసుకున్నాడు. యాకోబు ఏశావుతో ఇలా అన్నాడు, "విషయం ఏమిటంటే, నేను నీ కొరకు మంచి భోజనమును వండుతాను, నీవు నీ స్వాస్థ్యమును నాకు ఇవ్వు." అతడు చాలా ఆకలిగొని ఉన్నాడు గనుక "సరే, ఇస్తాను" అని చెప్పాడు. తరువాత అతడు ఏమి జరిగినదో గుర్తించి తన తండ్రి ఆశీర్వాదమును పొందగోరాడు. ఇప్పుడు, యాకోబు తన సొంత తల్లితో కుమ్మక్కై ఏశావు వలె నటించాడు. ఏశావు, చూశారా, ఒక "హి-మాన్" వంటి వాడు — శరీరమంతా వెంట్రుకలు, ఉన్నాయి కదా? కాబట్టి, అతడు తన శరీరము మీద జంతువుల తోళ్లు పెట్టుకొని ఏశావు వలె నటించి కుటుంబములోని పితరుని నుండి ఆశీర్వాదము కొరకు అడిగాడు. "సరే, నిన్ను ఆశీర్వదిస్తాను" అని ఇస్సాకు అంటాడు. ఈ విధంగా, ఏశావు యొక్క స్వాస్థ్యము అంతా దొంగిలించబడింది. మరియు, ఇది నిశ్చయముగా వైరము పుట్టించింది. యాకోబు సహోదరుని చేతిలో హతము చేయబడే అవకాశం ఉన్నది కాబట్టి అతడు పారిపోవలసివచ్చెను. కాని, ఇద్దరు సహోదరుల మధ్య అది మంచి సంబంధము కాదు... మరియు వారు దేశములుగా ఎదిగిన తరువాత ఈ వైరము మరింత బలపడింది; వారు ఒకరినొకరు ద్వేషించుకుంటారు. మరియు దీనిని చరిత్ర రుజువు చేస్తుంది.

— డా. టామ్ పెట్టర్

మొదటి విభాగములో యాకోబు, ఏశావు మరియు వారి వారసుల మీద పెట్టబడిన దృష్టి చివరి లేక ఏడవ విభాగమును అర్థము చేసుకొనుటలో మనకు సహాయం చేస్తుంది, 35:16-37:1లో ఉన్న సహోదరుల మధ్య సంఘర్షణకు ముగింపు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## సంఘర్షణకు ముగింపు (35:16-37:1)

ఈ విభాగములో, మోషే మరియొకసారి యాకోబు మరియు ఏశావుల మీద మరియు వారు ప్రాతినిధ్యం వహించిన దేశముల మీద దృష్టిపెట్టాడు. అతడు దీనిని మూడు భాగములలో చేశాడు. మొదటిగా, అతడు ఆదికాండము 35:16-26లో యాకోబు యొక్క వంశావళిని నమోదు చేశాడు. యాకోబు వారసులు ఇశ్రాయేలు దేశమును ఎలా నిర్మించారో ఈ భాగము వివరిస్తుంది. ఇది బెన్యామీను మరియు రూబేనులను గూర్చి క్లుప్త వివరణతో ఆరంభమై, ఇశ్రాయేలు పన్నెండు గోత్రములలోని పితరుల పట్టికతో ముగుస్తుంది.

రెండవదిగా, ఆది. 35:27-29లో ఇస్సాకు మరణించినప్పుడు యాకోబు మరియు ఏశావుల యొక్క వైఖరిని మోషే వర్ణించాడు. ఏశావు మరియు యాకోబులు ఇస్సాకును పాతిపెట్టారు అని ఈ క్లుప్త భాగము నివేదిస్తుంది. తన తండ్రి మరణించిన వెంటనే యాకోబును హతమార్చుతానని ఆది. 27:41లో ఏశావు బెదిరించుటను జ్ఞాపకము చేసుకున్నప్పుడు ఈ నివేదిక యొక్క తీక్షణత స్పష్టమవుతుంది. దీని వెలుగులో, ఇస్సాకు మరణమును గూర్చి ఇవ్వబడిన వివరణలో సహోదరుల మధ్య సంఘర్షణ ముగించబడింది అని కనిపిస్తుంది.

మూడవదిగా, ఆది. 36:1-43లో మోషే ఏశావు వంశావళిని గూర్చి ఒక విశాలమైన కథనమును ఇచ్చాడు. ఈ కథనము ఏశావు వంశములోని పలు భాగములకు చెందిన రెండు వంశావళులను కలుపుతుంది. శేయీరు ప్రాంతమును పాలించిన రాజులను గూర్చి తెలుపుతూ ఈ భాగము ముగుస్తుంది. యాకోబు కనాను దేశములో నివసించుటను కొనసాగించాడని చెబుతూ 37:1లో మోషే మరొక మాటను జోడించాడు. ఈ విధంగా ఏశావు యొక్క వంశావళిని ముగించుట ద్వారా, యాకోబు ఏశావుల మధ్య సంఘర్షణ ముగిసినప్పటికీ, సహోదరులిద్దరు విడిపోయారని మోషే స్పష్టము చేశాడు. యాకోబు వారసులు కనానులో నివసించారు మరియు ఏశావు వారసులు ఎదోములో నివసించారు.

యాకోబు జీవితము యొక్క మొదటి మరియు చివరి విభాగములలోని విషయములను మనస్సులో ఉంచుకొని, మోషే ఇచ్చిన కథనము యొక్క మధ్య భాగము వైపుకు మరొక మెట్టు ముందుకు వెళ్దాము, వాగ్దాన దేశములో పితరులు చేసిన సంకర్షణలను తెలుపు రెండవ మరియు ఆరవ విభాగములను చూద్దాము.

## ఇస్సాకు మరియు ఫిలిష్తీయులు (ఆదికాండము 26:1-33)

ఈ విభాగములు ఆది. 26:1-33లో ఇస్సాకు మరియు ఫిలిష్తీయుల మధ్య జరిగిన సమాధానకరమైన సంకర్షణలకు భిన్నముగా, ఆది. 33:18-35:15లో యాకోబు మరియు కనానీయుల మధ్య జరిగిన వైరముతో కూడిన సంకర్షణలను చూపుతాయి. ఇస్సాకును గూర్చి మరియు అతడు ఫిలిష్తీయులను ఎదుర్కొనుటను గూర్చి వర్ణించు రెండవ విభాగముతో మనము ఆరంభిద్దాము.

ఇప్పుడు, ఆదికాండములోని ఈ అధ్యాయము సరైన స్థలములో ఇవ్వబడలేదు అని విమర్శనాత్మక వ్యాఖ్యానకర్తలు వాదిస్తారు. ఇది ఇస్సాకుకు బదులుగా యాకోబు మీద దృష్టిపెడుతుంది అని మనమంతా చూడవచ్చు. మరియు ఈ సన్నివేశములు యాకోబు, ఏశావుల జననములకు చాలా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

కాలం క్రితం జరిగాయి అన్న విషయము కూడా నిజమే. కాని మనము చూడబోవుచున్నట్లు, యాకోబు జీవితము మీద మోషే పెట్టిన దృష్టికి ఈ విభాగము చాలా ప్రాముఖ్యమైనది.

ఈ విభాగము రెండు దగ్గర సంబంధము కలిగిన ఉపాఖ్యానములుగా విభాగించబడుతుంది. 26:1-11లో మొదటి భాగము ఇస్సాకు ఫిలిష్తీయులతో కలిగియుండిన ఆరంభ సమాధానమును వర్ణిస్తుంది. ఈ వచనములలో, ఇస్సాకు రిబ్కాను తన సహోదరి అని చెప్పి, ఫిలిష్తీయుల రాజైన అబీమెలెకును మోసం చేశాడు. ఇస్సాకు చేసిన మోసమును గుర్తించిన తరువాత, అబీమెలెకు రిబ్కాను ఇస్సాకుకు తిరిగిఇచ్చాడు. తరువాత ఆ ప్రాంతములో నివసించుటకు అతడు ఇస్సాకుకు అనుమతి ఇచ్చి, అతనికి ఎలాంటి హానిని తలపెట్టవద్దని తన ప్రజలను ఆజ్ఞాపించాడు.

26:12-33లో ఉన్న రెండవ ఉపాఖ్యానము ఇస్సాకు మరియు ఫిలిష్తీయుల మధ్య కొనసాగిన సమాధానమును గూర్చి నివేదిస్తుంది. ఈ భాగములో, దేవుడు ఇస్సాకును దీవించాడు, కాని అతడు కలిగియుండిన మందలు మరియు పశువులను బట్టి ఫిలిష్తీయులు అతని మీద అసూయపడ్డారు. కాబట్టి, ఇస్సాకు ఒక బావి నుండి మరొక బావి యొద్దకు ప్రయాణించుట ద్వారా హింసను నిరోధించాడు. ఇస్సాకుకు దేవుడిచ్చిన ఆశీర్వాదములను అబీమెలెకు ఒప్పుకొనుటతో మరియు బెయేర్షెబా యొద్ద వారిద్దరి మధ్య ఒక సమాధాన ఒప్పందము జరుగుటతో ఈ ఉపాఖ్యానము ముగుస్తుంది.

ఫిలిష్తీయులతో ఇస్సాకు చేసిన సమాధాన ఒప్పందము ఇస్సాకు, తద్వారా అతని కుమారుడైన యాకోబు, అబ్రాహాము వారసులను సత్యమును ఉద్ఘాటించింది. ఈ విభాగములోని విషయములను అబ్రాహాము జీవితముతో పోల్చినప్పుడు, అబ్రాహాము జీవితముతో అనేక పోలికలను మనము చూస్తాము. ఆది. 20:1-18లో అబీమెలెకు అనే పేరుగల మరొక ఫిలిష్తీయుల రాజును అబ్రాహాము ఎదుర్కొన్నాడు. ఆది. 21:30 మరియు 34లో అబ్రాహాము బావులను త్రవ్వి ఫిలిష్తీయుల మధ్య నివసించాడు. ఆది. 21:22-34లో బెయేర్షెబా వద్దనే అబ్రాహాము ఫిలిష్తీయులతో ఒక ఒప్పందమును చేసుకున్నాడు. ఫిలిష్తీయులతో ఇస్సాకు చేసిన సమాధానకరమైన అనుబంధమును దేవుడు ఆమోదించాడని నిస్సందేహముగా తెలుపుటకు మోషే ఈ పోలికలను రూపొందించాడు.

ఇప్పుడు ఇస్సాకు ఫిలిష్తీయులతో చేసిన సంకర్షణల నుండి 33:18-35:15లో యాకోబు మరియు కనానీయుల మధ్య జరిగిన సంకర్షణల మీద దృష్టిపెట్టు యాకోబు జీవితమును గూర్చిన విభాగము మీద దృష్టిపెడదాము.

## యాకోబు మరియు కనానీయులు (33:18-35:15)

యాకోబు మరియు కనానీయుల మధ్య జరిగిన సంఘర్షణలో కూడా రెండు దగ్గర సంబంధం గల ఉపాఖ్యానములు ఉన్నాయి. 33:18-34:31లో ఉన్న మొదటి ఉపాఖ్యానము షెకెములో యాకోబు చేసిన సంఘర్షణను గూర్చినది. యాకోబు కనానీయుల మధ్య నివసించుచున్న రోజులలో, హమోరు కుమారుడైన షెకెము యాకోబు కుమార్తె అయిన దీనాపై బలత్కారము చేశాడు. తమ సహోదరిపై జరిగిన ఈ దాడికి ప్రతిస్పందనగా, షెకెమీయులు సున్నతిపొందిన యెడల వారినందరినీ క్షమిస్తామని యాకోబు కుమారులు వారిని నమ్మబలికారు. కాని షెకెమీయులు సున్నతివలన కలిగిన బాధను అనుభవించుచున్నప్పుడు, యాకోబు కుమారులైన షిమ్యోను మరియు లేవీ వారి మీద దాడిచేసి వారిని



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

హతమార్చారు. తరువాత, కనానీయులు ప్రతీకారం తీర్చుకొను ఉద్దేశముతో తన కుటుంబమును నాశనము చేస్తారని యాకోబు భయపడ్డాడు. వారు సరైన పనినే చేశామని యాకోబు కుమారులు నొక్కిచెప్పినప్పటికీ, షిమ్యోను మరియు లేవీలను గూర్చి ఆది. 49:5-7లో ఇవ్వబడిన యాకోబు యొక్క చివరి మాటలు వేరొక విషయమును సూచిస్తున్నాయి.

ఆది. 35:1-15లోని రెండవ ఉపాఖ్యానములో, యాకోబు బేతేలు యొద్ద దేవుని యొద్ద నుండి ఒక నాటకీయమైన నిశ్చయతను పొందాడు. 35:2-4లో, బేతేలు యొద్ద బలిపీఠమును నిర్మించుటకు సిద్ధపాటుగా యాకోబు తనను మరియు తన కుటుంబమును దేవునికి అంకితం చేసుకున్నాడు. ఫలితంగా, కనానీయుల మీద దేవుని ఉగ్రత వచ్చింది కాబట్టి వారు యాకోబును వెంటాడలేదు. అప్పుడు, బేతేలు యొద్ద యాకోబు బలిపీఠమును నిర్మించిన తరువాత, దేవుడు అతనితో మాట్లాడి, అతడు తన తండ్రికి అసలైన వారసుడని యాకోబుకు నిశ్చయతనిచ్చాడు. దీనిని మనము విశేషముగా 35:10-12లో చూస్తాము, ఈ మాటలు 26:3-4లో ఇస్సాకుతో దేవుడు పలికిన మాటలను పోలియున్నవి. ఈ ఆశీర్వాదము కొరకు యాకోబు కృతజ్ఞతలు తెలుపుటతో ఈ ఉపాఖ్యానము ముగుస్తుంది.

మరియు రెండవ విభాగమును పోలిన విధముగానే, ఈ అధ్యాయములలో అబ్రాహాము మరియు యాకోబుల మధ్య మనము అనేక పోలికలను చూస్తాము. ఆది. 33:20లో, ఇంతకు ముందు ఆది. 12:7లో అబ్రాహాము చేసిన విధముగానే షెకెములో యాకోబు దేవుని కొరకు ఒక బలిపీఠమును నిర్మించాడు. అంతేగాక, 35:6-7లో, ఇంతకు ముందు ఆది. 12:8లో అబ్రాహాము చేసిన విధముగానే యాకోబు షెకెము నుండి బేతేలుకు ప్రయాణించి అక్కడ బలిపీఠమును నిర్మించాడు. రెండవ విభాగములో వలెనె, అబ్రాహాము జీవితముతో ఈ భావార్థకమైన సంబంధములు కనానీయులతో యాకోబు చేసిన సంఘర్షణలను దేవుడు ఆమోదించాడని చూపుతుంది.

ఇప్పుడు యాకోబు మరియు ఏశావులను వేరుచేసిన మూడవ మరియు ఐదవ విభాగములను చూద్దాము. ఈ కథనములు సహోదరులు విడిపోయిన రెండు వేర్వేరు సమయముల మీద దృష్టిపెడతాయి. 26:34-28:22లో ఉన్న మూడవ విభాగము యాకోబు ఏశావుల మధ్య వైరముతో కూడిన ఎడబాటును వర్ణిస్తుంది. మరియు ఆది. 32:1-33:17లో ఉన్న ఐదవ విభాగము యాకోబు ఏశావుల మధ్య జరిగిన సమాధానకరమైన ఎడబాటును వర్ణిస్తుంది. యాకోబు మరియు ఏశావుల మధ్య జరిగిన వైరముతో కూడిన ఎడబాటును చూద్దాము.

## వైరముతో కూడిన ఎడబాటు (ఆది. 26:34-28:22)

ఈ సన్నివేశములలో ఉన్న నైతిక సంక్లిష్టతలను కనుపరచు ఏశావు మరియు యాకోబులకు సంబంధించిన నాలుగు కథనముల మీద ఈ విభాగము దృష్టిపెడుతుంది. మొదటిగా, 26:34లో తన తల్లిదండ్రులకు విరోధముగా హిత్తీయుల నుండి భార్యలను తెచ్చుకొనుట ద్వారా ఏశావు తన విలువను తగ్గించుకున్నాడు. రెండవదిగా, 27:1-28:5లో, యాకోబు చేసిన మోసము ఇస్సాకు యొక్క ఆశీర్వాదములను పొందుకొనుటకు ఏ విధంగా కారణమైనదో ఈ విశాలమైన కథనము వర్ణిస్తుంది. ఈ సుపరిచితమైన వృత్తాంతములో, తన తండ్రియైన ఇస్సాకును మోసము చేయుట ద్వారా ఏశావుకు చెందవలసిన ఆశీర్వాదమును యాకోబు దొంగిలించాడు. ఏమి జరిగినదో తెలుసుకున్న తరువాత, ఏశావు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఎంత ఉగ్రుడయ్యాడంటే రిబ్కా యాకోబు ప్రాణము కొరకు భయపడింది. యాకోబు పద్దనరాముకు వెళ్లి అక్కడ నివసించి, అక్కడ భార్యను కనుగొనునట్లు అతనిని పద్దనరాముకు పంపవలెనని రిబ్కా ఇస్సాకును ఒప్పించింది. మూడవదిగా, ఏశావు మీద శ్రోతలు ఎక్కువ దయను చూపకుండా ఉండుటకు, ఏశావు తన తల్లిదండ్రుల ఇష్టమునకు విరుద్ధముగా ఇష్మాయేలీయుల నుండి భార్యలను తెచ్చుకున్నట్లు 28:6-9లో మోషే నివేదించాడు. నాల్గవదిగా మరియు చివరిగా 28:10-22లో బేతేలులో యాకోబు దర్శనము ద్వారా పొందిన ఆశీర్వాదమును గూర్చి నివేదించుట ద్వారా ఇస్సాకు వారసునిగా దేవుడు యాకోబును ఎంపిక చేసుకున్నాడని ఉద్ఘాటించబడింది.

## సమాధానకరమైన ఎడబాటు (ఆది. 32:1-32:17)

యాకోబు ఏశావుల యొక్క వైరముతో కూడిన ఎడబాటును వివరించు మూడవ విభాగమునకు భిన్నముగా, 32:1-33:17లో ఉన్న యాకోబు జీవిత నివేదిక సహోదరుల యొక్క సమాధానకరమైన ఎడబాటును గూర్చి నివేదిస్తుంది. ఈ విభాగములో రెండు దగ్గర సంబంధము కలిగిన ఉపాఖ్యానములు ఉన్నాయి. మొదటిగా, 32:1-32లో ఏశావును కలుసుకొనుటకు యాకోబు చేసిన సిద్ధపాటును చూస్తాము. వారు వైరముతో విడిపోయిన తరువాత కొన్ని సంవత్సరాలకు, తన కంటే ముందు సందేశకులను మరియు బహుమతులను పంపుట ద్వారా ఏశావును కలుసుకొనుటకు యాకోబు సిద్ధపడ్డాడు. హోషేయ 12:4 ప్రకారం, ఏశావును కలుసుకొనుటకు ముందు రోజు రాత్రి, యాకోబు ఒక దేవదూతతో పోరాడుతూ నమ్రపరచబడి దేవుని ఆశీర్వాదములను పొందుకున్నాడు.

> యాకోబు ఆశీర్వాదమును పొందుకుంటాడని దూత రిబ్కాకు ముందే వాగ్దానము చేశాడు, కాని యాకోబు ఆశీర్వాదమును పొందుకొనుటకు ప్రయత్నించిన విధానమును చూడండి … అతడు తన తండ్రిని మోసము చేశాడు మరియు తండ్రి నీ పేరేమి అని అడిగినప్పుడు, “నా పేరు ఏశావు, నేను నీ జ్యేష్ఠ కుమారుడను” అని చెప్పాడు. అతడు అబద్ధమాడాడు… కాని దేవుడు అతనిని దీవించాడు; దేవుడు అతనిని వృద్ధి చేశాడు, మరియు అబ్రాహాముకు ఇవ్వబడిన వాగ్దానము — “ఆకాశ నక్షత్రముల వలె, నీ సంతానమును చేయుదును” — నెరవేరునట్లు అతనికి అనేకమంది పిల్లలనిచ్చాడు, కాని అతడు వాగ్దాన దేశమునకు తిరిగివచ్చుచున్నప్పుడు, అతడు తన గతమును ఎదుర్కొనవలసివచ్చింది. మరియు ఈ సారి, అతడు ఏశావును కలుసుకొనుటకు ముందు రాత్రి, అతడు దూతతో సంఘర్షించుచున్నప్పుడు, దూత అతనిని “నీ పేరేమిటి?” అని ప్రశ్నించాడు. ఈ సారి అతడు నిజము చెప్పాడు. “నా పేరు యాకోబు” అని అన్నాడు. మరియు అతనికి ఇశ్రాయేలు అను క్రొత్త పేరు ఇవ్వబడినది.
>
> — డా. క్రెయిగ్ ఎస్. కీనర్

33:1-17లో ఉన్న రెండవ ఉపాఖ్యానము యాకోబు ఏశావుతో సమాధానపడుటను గూర్చి నివేదిస్తుంది. ఈ విభాగములో, సహోదరులు కలుసుకొని సమాధానకరముగా విడిపోతారు. ఈ విభాగములో ఉన్న వ్యత్యాసములు మరియు పోలికలు స్పష్టముగా ఉన్నాయి. యాకోబు ఇక మోసగానిగా ఉండక నిజాయితీగాను, నమ్రునిగాను ఉన్నాడు. ఏశావు ప్రతీకారమును కోరక, క్షమించాడు. తుదకు, కవలల మధ్య మునుపు ఉండిన వైరము పరిష్కరించబడి, వారు సమాధానముతో తమతమ మార్గములలో వెళ్లిపోయారు. ఏశావు చిత్రములో నుండి మాయమగుటతో ఈ విభాగము ముగించబడుతుంది. తరువాత, 34వ అధ్యాయములో, కనానీయులు మరియు ఒక నూతన భౌగోళిక నేపథ్యము ప్రత్యక్షమైయ్యింది. ఇదంతా మనలను ఆది. 29:1-31:55లో ఉన్న లాబాను దగ్గర యాకోబు గడిపిన కాలమును వర్ణించు ప్రాముఖ్యమైన నాల్గవ విభాగములోనికి నడిపిస్తుంది.

## లాబానుతో గడిపిన సమయం (ఆది. 29:1-31:55)

లాబానుతో యాకోబు గడిపిన సమయము ఐదు ప్రధానమైన భాగములుగా విభాగించబడుతుంది. 29:1-14లో యాకోబు పద్దనరాములో ప్రవేశించుటతో ఇది ఆరంభమవుతుంది. తరువాత 29:14-50లో లాబాను యాకోబునకు తన కుమార్తెలను ఇచ్చినప్పుడు చేసిన మోసమును గూర్చి మనము నేర్చుకుంటాము. యాకోబు వివాహములు తరువాత, ఇశ్రాయేలు గోత్రములకు పితరులైన యాకోబు కుమారుల యొక్క జననములను గూర్చి 29:31-30:24లో మనము చదువుతాము. తరువాత, లాబాను ఇంతకు ముందు చేసిన మోసమును సమతుల్యము చేయుటకు, 30:25-43లో యాకోబు లాబాను యొద్ద సంవత్సరముల పాటు చేసిన పనికి జీతమును అడిగినప్పుడు యాకోబు చేసిన మోసమును 30:25-43లో మోషే నివేదిస్తాడు. చివరిగా, 31:1-55లో, పద్దనరాము నుండి యాకోబు బయలుదేరుటను, లాబానుతో అతడు చేసిన సమాధాన నిబంధనను మనము చూస్తాము. ఈ ప్రాముఖ్యమైన అధ్యాయములు పలు రకముల మోసములను మరియు సంఘర్షణలను గూర్చి మాట్లాడతాయి. అయితే, కాసేపట్లో మనము చూడబోతున్నట్లు, యాకోబు జీవితములో అవి ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకొనివచ్చాయి.

> ఆదికాండము 25-37లో యాకోబు కథనమును మనము చూసినప్పుడు, యాకోబు జీవితములో చోటు చేసుకున్న వినూత్నమైన మార్పుల క్రమమును మనము చూస్తాము. మోసగానిగా అతడు ఆరంభించాడు, కాని తరువాత అతడు ఈ అమోఘమైన కృపగల ప్రత్యక్షతను దేవుని యొద్ద నుండి పొందుకున్నాడు, మరియు దేవుడు యాకోబు చేసిన మోసమును సంబోధించలేదుగాని అబ్రాహామునకు చేయబడిన వాగ్దానములన్నిటిని నూతనపరచాడు. యాకోబు దేవునితో ఒక ఒప్పందమును చేసుకున్నప్పుడు అతడు ఒక డీలర్ అయ్యాడు, మరియు దేవుడు ఆ వాగ్దానములను నెరవేర్చితే అతడు ఆయనకు కొంత భాగమును ఇస్తాడు. యాకోబు తన కంటే మోసగాడైన లాబానును కలుసుకున్నప్పుడు దేవుడు వాగ్దానములను నెరవేర్చాడు కాబట్టి అది ఎంత అద్భుతమైన ఒప్పందమో. మరియు యాకోబు తన జీవితములో దేవుని



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> ఆశీర్వాదములను అనుభవించినప్పుడు, అతడు దేవుని నమ్ముటకు మరింత సముఖత చూపాడు — కనీసం కొన్ని విధాలుగా — తద్వారా దేవుడు ఇంటికి తిరిగివెళ్ళమని చెప్పినప్పుడు, వెళ్లుటకు సిద్ధపడ్డాడు. తరువాత చివరికి, తన సహోదరుడు ఆయుధములు గల మనుష్యులతో ఎదురు వచ్చుచున్నాడని విన్నప్పుడు మోసగాడు, డీలర్ ఓడిపోయాడు. దేవుడు అతనిని దర్శించినప్పుడు "నాకు నీ ఆశీర్వాదములు కావాలి నా తండ్రివి వద్దు, ఏశావువి వద్దు. నీవి కావాలి!" అని యాకోబు చెప్పినప్పుడు ఓటమి పాలైనవాడు విమోచించబడ్డాడు. మరియు తుదకు, ఈ విధంగా, దేవుని నమ్ముటకు సిద్ధముగా ఉన్న స్థలమునకు అతడు తేబడ్డాడు మరియు అతడు ఇక తన స్వార్థం కొరకు పని చేయు మోసగానిగా ఉండవలసిన పనిలేదు.
>
> — డా. జాన్ ఒస్వల్ట్

పితరుడైన యాకోబును గూర్చిన మన పాఠములో ఇప్పటి వరకు, ఆదికాండములో యాకోబు జీవితము యొక్క నిర్మాణము మరియు విషయములను మనము చూశాము. ఇప్పుడు మన రెండవ అంశమును మనము చూడవలసియున్నది: ఈ అధ్యాయములలో కనిపించు ముఖ్య అంశములు.

## ముఖ్య అంశములు

విచారకరముగా, యాకోబును గూర్చిన వృత్తాంతము విశ్వాసుల యొక్క వ్యక్తిగత జీవితములకు సూటిగా అనువర్తింపబడుటకు వ్రాయబడినట్లు క్రీస్తు అనుచరులు వ్యవహరిస్తుంటారు. అవును, ప్రజలు ఎలా జీవించాలి అను విషయమును గూర్చి ఆదికాండములోని ఈ భాగము చాలా విషయములను చెబుతుంది. అయితే ఒక సగటు విశ్వాసి దానిని చదవబోతున్నాడు అనే ఉద్దేశముతో ఆదికాండము వ్రాయబడలేదు అని మనము ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. ప్రాచీన ఇశ్రాయేలులోని నాయకుల యొద్ద మాత్రమే లేఖనములు ఉండేవి. కాబట్టి, యాకోబు జీవితమును గూర్చి ప్రాధమికముగా ఇశ్రాయేలు దేశమంతటికీ అన్వయింపబడు విధముగా వ్రాయబడింది. వాగ్దాన భూమిలో తన రాజ్యమును నిర్మించు కార్యమును దేవుడు ఇశ్రాయేలుకు ఇచ్చాడు. అక్కడ నుండి వారు ఆయన రాజ్యమును భూదిగంతముల వరకు వ్యాపింపజేయవలసియుండినది. మరియు ఈ రాజ్య-నిర్మాణ కార్యము ప్రాచీన ఇశ్రాయేలు కొరకు మరియు నేడు క్రీస్తు రాజ్యములో నివసించుచున్న మీ కొరకు మరియు నా కొరకు యాకోబు జీవితములోని ముఖ్య అంశములను గుర్తించుటలో సహాయపడుతుంది.

అబ్రాహాము జీవితమును గూర్చిన మన పాఠములలో, మోషే నాలుగు అంశములను ఉద్ఘాటించినట్లు మనము చూశాము. అబ్రాహాము పట్ల దేవుడు చూపిన కృప, అబ్రాహాము దేవునికి చూపిన స్వామిభక్తి, అబ్రాహాముకు దేవుడిచ్చిన ఆశీర్వాదములు మరియు అబ్రాహాము ద్వారా దేవుడు ఇతరులకిచ్చిన ఆశీర్వాదములు. యాకోబు జీవితములో కూడా ఇవే అంశములు మరలా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రత్యక్షమవుతాయి. ఈ కారణము చేత, యాకోబు జీవిత వృత్తాంతము ఈ నాలుగు ప్రధాన అంశములను ఏ విధంగా ఉద్ఘాటిస్తుందో చూద్దాము. మొదటిగా, ఇశ్రాయేలుకు దేవుడు చూపిన కృపను మనము చర్చిద్దాము; రెండవదిగా, ఇశ్రాయేలు దేవునికి చూపవలసియుండిన స్వామిభక్తిని చూద్దాము; మూడవదిగా, ఇశ్రాయేలుకు దేవుడిచ్చిన ఆశీర్వాదములను చూద్దాము; మరియు నాల్గవదిగా, ఈ అధ్యాయములలో అత్యంత ప్రాముఖ్యమైన లక్షణమైన ఇశ్రాయేలు ద్వారా దేవుడు ఇతరులకు ఇచ్చిన ఆశీర్వాదములు. దేవుడు ఇశ్రాయేలుకు చూపిన కృప మీద యాకోబు వృత్తాంతము దృష్టిపెట్టిన కొన్ని విధానములను పరిశీలిస్తూ ఆరంభిద్దాము.

## దేవుడు ఇశ్రాయేలుకు చూపిన కృప

దేవుడు ఇశ్రాయేలుకు చూపిన కృపను మనము రెండు విధములుగా విశదీకరిద్దాము. ఒక వైపున, ఈ అంశము మోషే యొక్క వాస్తవిక అర్థమునకు, అనగా అతడు పురాతన ఇశ్రాయేలీయ శ్రోతలను ప్రభావితము చేయాలని కోరిన విధానము మీద ఎలా దృష్టి పెడుతుందో చూద్దాము. మరొక వైపున, ఆదికాండములోని ఈ భాగము యొక్క ఆధునిక అనువర్తనము మీద దైవిక కృప అను అంశము ప్రభావము చూపు మార్గములను చూద్దాము. ముందుగా మోషే యొక్క వాస్తవిక అర్థమును చూద్దాము.

### వాస్తవిక అర్థము

సామాన్య పదములలో, వారి జీవితములలో దేవుని కృపను గూర్చి ఇశ్రాయేలు ప్రజలకు బోధించుటకు, యాకోబు జీవితములో దేవుని కృపను మోషే మూడు మార్గములలో ఉద్ఘాటించాడు.

మునుపటి కృప. మొదటిగా, యాకోబు జన్మించుటకు ముందే దేవుడు యాకోబు మీద మునుపు కృపను ఎలా చూపాడో మోషే గుర్తించాడు. యాకోబు వృత్తాంతము యొక్క ఆరంభ ఉపాఖ్యానము ఈ అంశము మీద దృష్టిపెడుతుంది. ఆది. 25:23లో రిబ్కాతో దేవుడు పలికిన మాటలను వినండి:

> రెండు జనములు నీ గర్భములో కలవు. రెండు జనపదములు నీ కడుపులోనుండి ప్రత్యేకముగా వచ్చును. ఒక జనపదముకంటె ఒక జనపదము బలిష్ఠమైయుండును. పెద్దవాడు చిన్నవానికి దాసుడగును అనెను (ఆది. 25:23).

యాకోబు మంచియైనను, చెడు అయినను ఏమి చేయక ముందే యాకోబు దేవుని కనికరమును పొందుకున్నాడని రోమా. 9:11-12లో అపొస్తలుడైన పౌలు వ్యాఖ్యానించాడు. ఇంచుమించు ఇదే విధముగా, వాగ్దాన దేశము వైపుకు మోషేను అనుసరించిన ఇశ్రాయేలు గోత్రముల పట్ల దేవుడు చూపిన దయ కూడా దేవుడు మునుపు చూపిన కనికరముల మీద ఆధారపడియుండెను. ద్వితీ. 7:7-8లో, మోషే ఇలా సెలవిచ్చాడు:

> మీరు సర్వజనముల కంటె విస్తారజనమని యెహోవా మిమ్మును ప్రేమించి మిమ్మును ఏర్పరచు కొనలేదు... అయితే యెహోవా మిమ్మును ప్రేమించు వాడు గనుకను, తాను మీ తండ్రులకు చేసిన ప్రమాణమును నెరవేర్చువాడు గనుకను,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> యెహోవా బాహుబలముచేత మిమ్మును రప్పించి దాసుల గృహములో నుండియు ఐగుప్తురాజైన ఫరో చేతిలోనుండియు మిమ్మును విడిపించెను (ద్వితీ. 7:7-8).

కొనసాగు కృప. రెండవ స్థానములో, యాకోబు జీవితములో దేవుని కొనసాగు కృప యొక్క ప్రాముఖ్యతను కూడా మోషే ఉద్ఘాటించాడు. తమ జీవితములలో కూడా దేవుని కొనసాగు కృప ఎంత అవసరమైయున్నదో ఇది ఇశ్రాయేలీయులకు నేర్పించింది. ఆది. 25:24-26లోని యాకోబు జనన వృత్తాంతములో ఇది మొదటిసారి కనబడుతుంది. ఆది. 25:26ను వినండి:

> తరువాత అతని సహోదరుడు బయటికి వచ్చి నప్పుడు అతని చెయ్యి ఏశావు మడిమెను పట్టుకొనియుండెను గనుక అతనికి యాకోబు అను పేరు పెట్టబడెను (ఆది. 25:26).

యాకోబు జననమందు "ఏశావు మడిమెను పట్టుకున్నాడు" గనుక అతనికి యాకోబు అని పేరు పెట్టబడింది. యాకోబు అను పేరు, హెబ్రీ భాషలో יַעֲקֹב (యకోబ్), ఇక్కడ "మడిమె," లేక హెబ్రీ భాషలో עָקֵב (అకీబ్), అని అనువదించబడిన అదే మూల పదము నుండి వెలువడుతుంది. ఫలితంగా, యాకోబు అను పేరునకు అర్థము, "మడిమెను పట్టుకొనువాడు" అయ్యున్నది. కాని, ఈ సందర్భములో మాత్రం, ఈ పేరుకు లయపరచుట మరియు మోసము చేయుట అను అర్థములు ఉన్నాయి, ఎందుకంటే తన జననము నుండే యాకోబు ప్రథమ కుమారుని స్థానమును తీసుకొనుటకు ప్రయత్నించుచు వచ్చాడు. యాకోబు అను పేరునకు అర్థము "మోసగాళ్లకే మోసగాడు" అని కూడా మనము చెప్పవచ్చు. ఏశావు ఆశీర్వాదమును తాను పొందుకొనునట్లు ఇస్సాకును యాకోబు మోసము చేసిన తరువాత ఆది. 27:36లో ఏశావు యొక్క ప్రతిస్పందన దీనిని వివరిస్తుంది:

> ఏశావు యాకోబు అను పేరు అతనికి సరిగానే చెల్లినది; అతడు నన్ను ఈ రెండు మారులు మోసపుచ్చెను. నా జ్యేష్ఠత్వము తీసికొనెను, ఇదిగో ఇప్పుడు వచ్చి నాకు రావలసిన దీవెనను తీసికొనె[ను] (ఆది. 27:36).

యాకోబు పేరు ఖచ్చితముగా అతని క్రియలకు సరిపోయింది మరియు తన జీవితము యొక్క ప్రతి దినమున అతనికి దేవుని యొక్క కొనసాగు కృప అవసరమైయుండినది అని ఇది స్పష్టము చేసింది. తన వాస్తవిక శ్రోతలకు విశేషముగా అవసరమైయుండిన దేవుని యొక్క కొనసాగు కృప మీద మోషే తరచుగా దృష్టిపెట్టాడు.

ఉదాహరణగా, ఆది. 26:26-33లో, ఫిలిష్తీయుల మధ్య భద్రతను కల్పించుట ద్వారా యాకోబు తండ్రియైన ఇస్సాకుకు దేవుడు కనికరమును చూపాడు. మోషే ఈ అధ్యాయములను వ్రాసినప్పుడు, ఫిలిష్తీయుల నుండి భద్రతను పొందుటకు తన ఇశ్రాయేలీయ శ్రోతలకు కూడా దేవుని కృప అవసరమైయుండినది. దీనికి తోడు, 34:1-31లో, దేవుడు యాకోబుకు కృపతో కనానీయుల మీద జయమును అనుగ్రహించాడు. ఈ ఉదాహరణ ద్వారా, తమ దినములలో కనానీయుల మీద విజయమును సాధించుటకు దేవుని యొక్క కొనసాగు కృప ఏ విధంగా అవసరమైయుండినదో మోషే యొక్క వాస్తవిక శ్రోతలు నేర్చుకోగలిగారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

భవిష్యత్ కృప. మూడవదిగా, యాకోబు వృత్తాంతము దేవుని యొక్క భవిష్యత్ కృప మీద కూడా దృష్టిపెడుతుంది. మరొకసారి, మోషే కథనము యొక్క ఆరంభ ఉపాఖ్యానములో ఈ అంశమును మనము చూస్తాము. మీకు జ్ఞాపకమున్నట్లయితే, ఆది. 25:23లో, యాకోబు జననమునకు ముందు, దేవుడు ఇలా వాగ్దానము చేశాడు:

> ఒక జనపదముకంటె ఒక జనపదము బలిష్టమై యుండును. పెద్దవాడు చిన్నవానికి దాసుడగును (ఆది. 25:23).

ఇశ్రాయేలీయులు వాగ్దాన భూమిలో స్థిరముగా స్థాపించబడి తమ పరిపాలనను — తద్వారా దేవుని పరిపాలనను — ఏశావు వారసుల మీదికి కూడా వ్యాపింపజేస్తారని ఈ వాగ్దానము సూచించింది. మరియు మోషే యొక్క వాస్తవిక శ్రోతలు తమ దినములలో ఎదోమీయులను ఎదుర్కొన్నారు కాబట్టి వారికి ఈ భవిష్యత్ వాగ్దానము మరింత ఔచిత్యమైనదిగా ఉన్నది.

మరియు యాకోబు జీవితమును గూర్చిన వృత్తాంతములో దేవుడు భవిష్యత్ కృపను గూర్చి మరిన్ని వాగ్దానములను చేశాడు. ఉదాహరణకు, ఆది. 28:10-22లో బేతేలు యొద్ద యాకోబు చూసిన దర్శనములో, దేవుడు యాకోబుకు అనేక భవిష్యత్ కనికరములను గూర్చి నిశ్చయతనిచ్చాడు. మరియు తరువాత, 35:11-12లో బేతేలు యొద్ద యాకోబు చేసిన ఆరాధనలో దేవుడు ఇలాంటి కృపా వాగ్దానములనే పునఃఉద్ఘాటించాడు. యాకోబుకు భవిష్యత్ కృపను గూర్చి చేయబడిన ఈ వాగ్దానములు, కనానును స్వాధీనపరచుకొని, దానిలో స్థిరపడుటకు వెళ్లుచుండగా మోషే శ్రోతలకు దేవుడు అందించిన ఉజ్వల భవిష్యత్తును చూపింది.

> ఇశ్రాయేలుకు వాగ్దాన భూమి మీద హక్కు ఉన్నదని యాకోబు వృత్తాంతములు ఏ విధంగా ఉద్ఘాటిస్తాయో గ్రహించుటకు, మనము కనీసం రెండు విషయములను జ్ఞాపకముంచుకోవాలి. మొదటిగా ఈ వృత్తాంతములు ప్రధానముగా యాకోబు ఏశావుల మధ్య — అబ్రాహాము వాగ్దానములకు అర్హమైన వారసులగుటకు పోటీపడు గుంపులు — భిన్నత్వములను చూపుతాయి. మరియు యాకోబు ఏశావులను గూర్చిన వృత్తాంతముల మధ్య ఉన్న భిన్నత్వము, ఏశావు ఎదోమీయులు ఉండిన దక్షిణ ప్రాంతమునకు వెళ్లాడని మరియు దేవుడు అతనికి ఆ దేశమును ఇచ్చాడని — దేవుడు అతనిని అక్కడ స్థాపించాడని — మరియు యాకోబు వాగ్దాన దేశము కొరకు అబ్రాహాముకు ఇవ్వబడిన వాగ్దానమునకు అర్హమైన వారసుడని చాలా స్పష్టముగా చూపుతాయి. అయితే యాకోబు విడిచిపెట్టిన తరువాత లాబాను వృత్తాంతములో కూడా దీనిని మీరు చూడవచ్చు. ఉత్తర దిక్కున అతనికి బంధువులు ఉన్నారు కాని అతడు అక్కడ కొంత కాలము పాటు మాత్రమే ఉన్నాడు. కాని యాకోబు తండ్రిని మోసము చేసి, సహోదరుని మోసము చేసి వాగ్దాన దేశమును విడిచివెళ్లాడు అనే సత్యము యాకోబు/ఏశావు, యాకోబు మరియు లాబానుల మధ్య ఉన్న ఈ భిన్నత్వముల కంటే ప్రాముఖ్యమైనది; అతడు వాగ్దాన దేశమును విడిచివెళ్లాడు. 28వ అధ్యాయములో, అతడు బేతేలు యొద్ద ఒక సుపరిచితమైన దర్శనమును చూశాడు, దానిలో

> దేవుడు మరియు దేవదూతలు తన యొద్దకు వచ్చుటను చూసి యాకోబు ఇలా అన్నాడు, "నేను ఈ దేశమునకు మరలా తిరిగి వస్తానను నిశ్చయతను మీరు నాకు ఇవ్వగలరా?" మరియు అతడు తిరిగివస్తాడని దేవుడు అతనికి నిశ్చయతనిచ్చాడు. తరువాత 35వ అధ్యాయములో, దేవుడు ఇలా అనినప్పుడు ఆ విషయము మరలా జ్ఞాపకము చేసుకొనబడుతుంది, "బేతేలుకు వెళ్లుము; అక్కడ బలిపీఠము కట్టుము. నేను నిన్ను తిరిగి తీసుకొని వస్తానని చెప్పిన చోటికి వెళ్లి ఒక బలిపీఠమును నిర్మించు." మరియు బేతేలు వాగ్దాన భూమిలో ఉన్నది. అతడు వైఫల్యములను ఎదుర్కొన్నప్పటికీ, తన సహోదరుని మోసము చేసినప్పటికీ, తండ్రిని మోసము చేసినప్పటికీ, లాబాను యొద్ద నివసించినప్పుడు కొన్ని ప్రశ్నార్థకమైన కార్యములను చేసినప్పటికీ, యాకోబుకు దేవుడు ఆ భూమిని ఇచ్చాడని యాకోబు జీవితములోని ఈ రెండు వాక్య భాగములు స్పష్టముగా తెలియజేస్తున్నాయి. వీటన్నిటి మధ్య కూడా, తన పితరుడైన అబ్రాహాముకు వాగ్దానము చేయబడిన భూమిని పొందుకొనుటకు దేవుడు యాకోబును ఎన్నుకున్నాడు.
>
> — డా. రిచర్డ్ ఎల్. ప్రాట్, జూ.

వాస్తవిక అర్థమును మనస్సులో ఉంచుకొని ఇశ్రాయేలుకు దేవుడిచ్చిన కృపను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, యాకోబు వృత్తాంతము యొక్క ఆధునిక అనువర్తనముపై దేవుని కృప ప్రభావమును చూపు కొన్ని మార్గములను ఇప్పుడు మనము చూద్దాము.

## ఆధునిక అనువర్తనము

అవును, క్రీస్తు అనుచరులముగా దేవుని కృప అను అంశమును మన జీవితములకు మనము అనేక విధాలుగా అనువర్తించుకోవచ్చు. అయితే సౌకర్యముగా ఉండుటకు, మనము క్రీస్తు రాజ్యము యొక్క ఆవిష్కృతము, సంఘ చరిత్ర అంతటిలో క్రీస్తు రాజ్యము యొక్క కొనసాగింపు, మరియు ఆయన మహిమలో తిరిగివచ్చినప్పుడు రాజ్యము యొక్క నెరవేర్పు దృష్ట్యా దీనిని గూర్చి మనము ఆలోచన చేద్దాము. క్రీస్తు రాజ్యములోని ఈ మూడు స్థాయిలు తమ జీవితములలో దేవుని యొక్క భూత, వర్తమాన, భవిష్యత్ కృపలను కనుగొనమని క్రీస్తు అనుచరులకు క్రొత్త నిబంధన బోధించు కొన్ని ప్రధానమైన మార్గములకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

మొదటిగా, క్రీస్తు అనుచరులముగా, యాకోబు జీవితములో మునుపటి కృపను మనము చూసినప్పుడు, క్రీస్తులో దేవుని రాజ్యము యొక్క ఆవిష్కృతములో దేవుడు మనకు బయలుపరచిన మునుపటి కృపను మనము జ్ఞాపకము చేసుకోవాలి. క్రీస్తు యొక్క మొదటి రాకడ పాత నిబంధన అంతటా వ్యాపించియున్న కృపా చరిత్రకు ముగింపును పలికింది. మరియు రోమా. 5:21 వంటి లేఖన భాగములు సూచించునట్లు, దేవుడు మునుపెన్నడూ లేని విధముగా క్రీస్తు యొక్క మొదటి రాకడలో కృపను, కనికరమును చూపాడు. పౌలు చెప్పినట్లుగా:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

> పాపమెక్కడ విస్తరించెనో అక్కడ కృప అపరిమితముగా విస్తరించెను (రోమా. 5:21).

రెండవదిగా, యాకోబు జీవితములో కొనసాగు దేవుని కృప క్రీస్తు రాజ్యము యొక్క కొనసాగింపులో దేవుని యొక్క కొనసాగు కనికరములను వెదకి, వాటి మీద ఆధారపడమని మనకు జ్ఞాపకము చేస్తుంది. హెబ్రీ 4:16 వంటి వాక్యభాగములు మనకు బోధించుచున్నట్లు, క్రీస్తు అనుచరులు "[దేవుని] కృపా సింహాసనము యొద్దకు నిశ్చయతతో వెళ్లవచ్చును." మరియు "మన అవసర కాలములో సహాయము చేయుటకు కొనసాగు కృపను మనము కనుగొంటాము."

మరియు మూడవదిగా, యాకోబుకు దేవుడిచ్చిన భవిష్యత్ కృపను గూర్చి మనము చూసినప్పుడు, క్రీస్తు రాజ్యము యొక్క సంపూర్ణతలో మనకు లభించు దేవుని భవిష్యత్ కృపను మనము జ్ఞాపకముంచుకోవాలి. వాగ్దాన భూమిలో దేవుని యొక్క భవిష్యత్ కృపను గూర్చి మోషే యొక్క వాస్తవిక శ్రోతలు నేర్చుకున్న విధముగానే, నూతన సృష్టిలో దేవుని వాగ్దానముల యొక్క నెరవేర్పును చూచుటకు క్రీస్తు అనుచరులు ఆశతో ఎదురుచూస్తున్నారు. క్రీస్తు తిరిగివచ్చినప్పుడు మనము "[దేవుని] కృప యొక్క ఎనలేని ఐశ్వర్యమును" పొందుతామని ఎఫెసీ. 2:7 మనకు జ్ఞాపకము చేస్తుంది.

## దేవునికి ఇశ్రాయేలు చూపిన స్వామిభక్తి

ఇశ్రాయేలుపై దేవుడు చూపిన కృపలోని ప్రధానమైన అంశములను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు రెండవ ప్రధానమైన అంశమును మనము చూడవలసియున్నది: ఇశ్రాయేలు దేవునికి చూపవలసియుండిన స్వామిభక్తి. నిత్య రక్షణ కేవలం దేవుని కృప ద్వారా మాత్రమే ఇవ్వబడుతుంది అని పాత మరియు క్రొత్త నిబంధనలు రెండు స్పష్టము చేస్తాయి. ఏ ఒక్కరు కూడా క్రియల మూలముగా రక్షణను సంపాదించలేదు. అయితే ప్రజలు దేవుని రక్షించు కృపను పొందుకున్నప్పుడు, దేవుని ఆత్మ వారిని మార్చుట ఆరంభిస్తాడు, మరియు ఆయన చూపిన కృపలను బట్టి వారు హృదయపూర్వకముగా దేవుని ఆజ్ఞలను పాటించుటకు ప్రయత్నిస్తారని కూడా లేఖనములు స్పష్టము చేస్తాయి. ఇది మనలో ఉన్న దేవుని ఆత్మ ఫలమైయున్నది. యాకోబు జీవితములో దేవునికి స్వామిభక్తి అను అంశమును మనము చూచుచుండగా, సామాన్య వేదాంతశాస్త్ర దృక్పథములను మనము ఎల్లప్పుడు మనస్సులో ఉంచుకోవాలి.

మన ఉద్దేశమును స్పష్టము చేయుటకు, ఇశ్రాయేలు దేవునికి చూపిన స్వామిభక్తి విషయములో మోషే యొక్క వాస్తవిక అర్థమును మొదట చూద్దాము, తరువాత ఈ అంశము యొక్క ఆధునిక అనువర్తనమును చూద్దాము. మోషే యొక్క వాస్తవిక అర్థమును మొదట చూద్దాము.

### వాస్తవిక అర్థము

సామాన్యముగా, మోషే యొక్క వాస్తవిక శ్రోతలను తమ దినములలో దేవునికి స్వామిభక్తి చూపమని పిలచుటకు మోషే యాకోబు దేవునికి చూపిన స్వామిభక్తిని ఉద్ఘాటించాడు. దేవుడు యాకోబును తనకు నమ్మకమైన సేవకునిగా మార్చుకున్న విధానమును ఎత్తి చూపుట ద్వారా మోషే ఒక విధముగా దీనిని చేశాడు. యాకోబు వృత్తాంతము యొక్క ఆరంభ విభాగములలో, పితరుని గూర్చి



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రతికూలమైన విషయములు తెలియపరచబడ్డాయి. యాకోబు జననమందు తన సహోదరుని మడిమెను పట్టుకొని, జ్యేష్ఠ కుమారుని స్థానమును లాగుకొనుటకు ప్రయత్నించిన విధానము తెలియపరచబడింది. అతడు యౌవ్వన కాలములో ఉన్నప్పుడు, ఏశావు యొక్క ఆకలిని ఉపయోగించుకొని యాకోబు అతని జ్యేష్ఠత్వమును లాగుకొనుటను గూర్చి మనము నేర్చుకుంటాము. ఏశావుకు చెందవలసిన ఆశీర్వాదమును పొందుకొనుటకు అతడు వృద్ధుడైన తన తండ్రిని కూడా మోసము చేశాడు. అయితే ఈ ఆరంభ ప్రతికూల చిత్రీకరణలో ఉన్న ఒకేఒక్క మంచి విషయము ఏమిటంటే, దేవుడు అతనిని రక్షించిన యెడల, యెహోవా తనకు దేవునిగా ఉంటాడని బేతేలు యొద్ద యాకోబు చేసుకొనిన ఒడంబడిక.

ఇప్పుడు, ఈ ఒడంబడిక తరువాత, యాకోబు లాబానుతో జీవించుటకు వెళ్లాడు. ఖచ్చితముగా, బేతేలులో యాకోబు హృదయములో నాటబడిన దేవుని పట్ల స్వామిభక్తి అను విత్తనము ఎదుగుట కొనసాగింది. అతని మామ అతనితో దుర్వ్యవహరించినప్పటికీ, లాబాను యొద్ద నుండి తిరిగివచ్చిన తరువాత యాకోబు ఒక క్రొత్త మనిషిగా మారిపోయాడు.

మోషే ఈ మార్పును కనీసం నాలుగు విధాలుగా స్పష్టము చేశాడు. మొదటిగా, యాకోబు ఏశావు ఎదుట పశ్చాత్తాపపడ్డాడని మోషే నివేదించాడు. 32:4-5లో, ఏశావును "నా ప్రభువు" అని పిలువమని యాకోబు తన సేవకుని హెచ్చరించాడు. ఆది. 33:8లో యాకోబు స్వయంగా ఏశావును కలిసినప్పుడు, అతనిని "నా ప్రభువు" అని పిలిచాడు.

రెండవదిగా, యాకోబు దేవుని ఎదుట పశ్చాత్తాపపడ్డాడు. ఉదాహరణకు, ఆది. 32:10లో యాకోబు దేవుని ఎదుట ఇలా ఒప్పుకున్నాడు:

> **నీవు నీ సేవకునికి చేసిన సమస్తమైన ఉపకారములకును సమస్త సత్యమునకును అపాత్రుడను (ఆది. 32:10).**

మూడవదిగా, యాకోబు దేవుని యొద్ద నుండి ఒక క్రొత్త పేరును పొందాడు. ఆది. 32:22-32లో, యబ్బోకు రేవు యొక్క యేరు యొద్ద యాకోబు దేవదూతతో పెనుగులాడాడు. 27వ వచనములో, యాకోబు తాను "మోసగాని"నని ఒప్పుకొంటు, తన పేరు యాకోబు అని చెబుతూ దేవదూత ఎదుట ఒప్పుకున్నాడు. అయితే ఆది. 32:28లో దేవదూత ఇలా జవాబిస్తు యాకోబు ఒప్పుకోలుకు స్పందించాడు:

> **అప్పుడు ఆయన నీవు దేవునితోను మనుష్యులతోను పోరాడి గెలిచితివి గనుక ఇకమీదట నీ పేరు ఇశ్రాయేలేగాని యాకోబు అనబడదని చెప్పెను (ఆది. 32:28).**

బైబిలులోని అనేక ఇతర పేర్ల వలె, *יִשְׂרָאֵל*(ఇశ్రాయెల్) అను పేరు కూడా, చరిత్రలో ఒక సమయమందు, దేవునికి స్తుతిగా ఉండినది, మరియు దీని అర్థము "దేవుడు సంఘర్షించుట" లేక "పోరాడుట." ఇది *שָׂרָה*(సరహ్) అను హెబ్రీ క్రియా పదములో నుండి వెలువడుతుంది, మరియు 28వ వచనములో "నీవు సంఘర్షించావు" అని అనువదించబడింది. ఈ పేరు యాకోబుకు ఒక విశేషమైన రీతిలో అనువర్తించబడింది అని దేవదూత వివరించాడు, ఎందుకంటే, "అతడు దేవునితోను మనుష్యులతోను పెనుగులాడి జయించాడు." యాకోబు దేవునితో చేసిన సంఘర్షణ ఈ సందర్భములో ఆశీర్వాదము కొరకు చేసిన పెనుగులాటను సూచిస్తుంది. మరియు, మనుష్యులతో యాకోబు చేసిన సంఘర్షణ ఏశావు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మరియు లాబానుతో చేసిన సంఘర్షణను సూచిస్తుంది. యాకోబు జీవిత విషయములో, అతడు నూతన పురుషుడని తనకు ఇవ్వబడిన క్రొత్త పేరు సూచించింది. మోసగానిగా ఉండుటకు బదులుగా, సంఘర్షణ చేసి జయించిన "ఇశ్రాయేలు"గా యాకోబు మారిపోయాడు.

> యాకోబు పేరును దేవుడు స్వయంగా ఇశ్రాయేలు అని మార్చిన ఆసక్తికరమైన వృత్తాంతమును ఆదికాండము గ్రంథములో మనము చదువుతాము. యాకోబు దేవదూతతో పెనుగులాడాడు మరియు ఆ దేవదూత దేవునికి ప్రతినిధిగా ఉండెనని అతడు గ్రహించాడు; అది దేవుని దూత. మరియు దేవుడు అతని కొరకు ఒక విశేషమైన ప్రణాళికను కలిగియుండెనని అతడు గ్రహించాడు. దేవుడు అతనిని దృష్టించాడు, అతనిని దర్శించాడు, మరియు అతని కొరకు చాలా ప్రాముఖ్యమైన ఉద్దేశమును కలిగియుండినాడు. కాబట్టి, అతని పేరు మార్చబడినది... పురాతన ఇశ్రాయేలులో, పిల్లలు పుట్టేంత వరకు ప్రజలు వారికి పేర్లు పెట్టేవారు కాదు. వారికి ముందుగా పేర్లు పెట్టేవారు కాదు. ఒకవేళ అబ్బాయి అయితే మేము ఈ పేరు పెడతాము, లేక అమ్మాయి అయితే ఈ పేరు పెడతాము అని వారు అనేవారు కాదు. బదులుగా, వారు ఒక రకమైన చిహ్నము కొరకు, గురుతు కొరకు, సూచన కొరకు ఎదురు చూసేవారు. ఇప్పుడు, యాకోబు జన్మించినప్పుడు — అతడు గర్భములో నుండి బయటకు వచ్చినప్పుడు — అతడు తన సహోదరుడైన ఏశావు యొక్క మడిమెను పట్టుకున్నాడు కాబట్టి యాకోబు విషయములో ఇది జరిగింది. కాబట్టి అతనికి హెబ్రీ భాషలో "యాకోవ్" అను పేరు ఇవ్వబడినది, అనగా "మడిమెవాడు" లేక "మడిమెను పట్టుకొనువాడు," లేక "మడిమె వంటివాడు" అని అర్థము. మరియు దానిని అతడు జీవితకాలమంతా మోశాడు... అయితే దేవుడు అతనిని కలిసినప్పుడు మాత్రం అతడు ఒక నూతన జీవమును పొందాడు. దేవుడు యాకోబును పట్టుకొని, అతని జీవితమునకు ఒక నిజమైన ఉద్దేశ్యమును ఇచ్చినప్పుడు, తన సొంత తండ్రియైన ఇస్సాకు కంటే, తన తాతయైన అబ్రాహాము కంటే మరింత సూటిగా అతడు ఒక దేశమునకు తండ్రిగా ఉంటాడని అతనికి తెలియజేయబడింది... కాబట్టి యాకోబు నుండి ఇశ్రాయేలుకు పేరు యొక్క మార్పు ఒక అద్భుతమైన విషయము మరియు దానిలో దేవుని పాత్రను మనము గౌరవిస్తాము, ఆయన ఇశ్రాయేలు దేశము యొక్క తండ్రిని తన సేవ కొరకు మరియు భూమి మీద తన యొక్క మొదటి ప్రజలను స్థాపించుటకు పిల్లలను కనుట కొరకు పిలిచాడు.
>
> — డా. డగ్లస్ స్టువార్ట్

మోషే యొక్క వాస్తవిక శ్రోతలకు యాకోబుకు ఇవ్వబడిన క్రొత్త పేరు యొక్క ప్రాముఖ్యతను మాటలలో వర్ణించలేము. మోషే ఐగుప్తు నుండి వాగ్దాన భూమిలోనికి నడిపిన పన్నెండు గోత్రముల యొక్క జాతీయ పేరు "ఇశ్రాయేలు." దేవుని యొక్క నమ్మకమైన సేవకునిగా పితరునికి ఇవ్వబడిన క్రొత్త



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పేరును వారు వినినప్పుడు, ఇశ్రాయేలుగా ఉంటూ యాకోబు వలెనె సంఘర్షించుటకు జయించుటకు వారు పిలువబడ్డారని వారికి జ్ఞాపకము చేయబడింది.

లాబానుతో అతడు గడిపిన సమయము తరువాత యాకోబు యొక్క నాల్గవ, మరియు భావార్థకమైన చిత్రీకరణ, బేతేలుకు తిరిగివచ్చిన తరువాత అతడు అర్పించిన నమ్మకమైన ఆరాధన అయ్యున్నది. ఆది. 28:20-21లో బేతేలు యొద్ద అతడు దేవుని పట్ల స్వామిభక్తిని కనుపరచినట్లు, ఆది. 35:3లో బేతేలు యొద్ద యాకోబు ఒక బలిపీఠము కట్టి దేవునిని నిజాయితీగా ఆరాధించాడు.

యాకోబులో జరిగిన పరివర్తనను గూర్చి మోషే ఇచ్చిన కథనము వాస్తవిక శ్రోతలకు రెండు కీలకమైన అంతర్భావములను ఇచ్చింది. తన శ్రోతలు దేవుని పట్ల అనేక విధాలుగా చూపిన స్వామిద్రోహమును వారు ఎదుర్కొనవలసియున్నది కాబట్టి యాకోబు యొక్క స్వామిద్రోహమును అతడు తెలియపరచాడు. అయితే తమ దినములలో యాకోబు యొక్క స్వామిభక్తిని తన శ్రోతలు అనుకరించాలని ప్రోత్సహించుటకు దేవునికి నమ్మకమైన సేవకునిగా యాకోబు పొందిన పరివర్తనను కూడా అతడు తెలియపరచాడు. మరియు మోషే యొక్క వాస్తవిక శ్రోతలు దేవుని కృప మీద ఆధారపడవలసిన అవసరత ఎంత ఉన్నదో, వాగ్దాన దేశములో జీవిత సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు వారు దేవునికి నమ్మకమైన సేవ చేయవలసిన అవసరత కూడా అంతే ఉండినది.

మోషే యొక్క వాస్తవిక అర్థము దృష్ట్యా దేవుని పట్ల ఇశ్రాయేలు యొక్క స్వామిభక్తి అను అంశమును ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, యాకోబు జీవితము యొక్క ఆధునిక అనువర్తనమునకు ఒక దృక్పథముగా మనము ఈ అంశమును చూడవలసియున్నది. మన ఉద్దేశ్యముల కొరకు, యాకోబు జీవితములోని ఈ కోణము క్రీస్తు రాజ్యము యొక్క ఆవిష్కృతము, కొనసాగింపు మరియు సంపూర్ణత దృష్ట్యా ఎలా అనువర్తించబడుతుందో చూద్దాము.

## ఆధునిక అనువర్తనము

మొదటిగా, యాకోబు జీవిత వృత్తాంతము దేవునికి స్వామిభక్తిని చూపుటకు మనలను బాధ్యులుగా ఎంచుకొనునట్లు పురికొల్పు ప్రతిసారి, రాజ్య ఆవిష్కృతములో క్రీస్తు స్వయముగా నీతియావత్తును ఏ విధంగా నెరవేర్చాడో మనము గుర్తుంచుకోవాలి. క్రీస్తు మనవలె శోధించబడ్డాడుగాని, పాపము చేయలేదని హెబ్రీ. 4:15 బోధిస్తుంది. వాస్తవానికి, క్రీస్తు దేవుని ఆజ్ఞలకు ఎంత నమ్మకముగా ఉన్నాడంటే ఆయన తనయందు నమ్మిక ఉంచు ప్రతివారి స్థానములో దేవుని ఉగ్రతను తనపై వేసుకొని సిలువ మీద స్వతహాగా మరణించాడు. మరియు విశ్వాసము ద్వారా ఆయన పరిపూర్ణ నీతి మనకు ఇవ్వబడినది. రాజ్యము యొక్క ఆవిష్కృతములో క్రీస్తు స్వయంగా దేవునికి చూపిన స్వామిభక్తి యాకోబు జీవితమును నైతికవాదమునకు — "ఇది చేయండి; అది చేయవద్దు" — అనువర్తించకుండా మనలను కాపాడుతుంది. యాకోబు జీవితము యొక్క ప్రతి నైతిక అంతర్భావమును మొదటిగా మన కొరకు క్రీస్తు నెరవేర్చిన నీతి అంతటి దృష్టిలో చూడాలి.

రెండవదిగా, యాకోబును గూర్చిన వృత్తాంతములో మనము స్వామిభక్తి అను అంశమును చూసినప్పుడు, నేడు మనము క్రీస్తునకు చేయవలసిన నమ్మకమైన సేవ కొరకు ఒక నడిపింపును మనము పొందుకుంటాము. క్రీస్తు రాజ్యము యొక్క కొనసాగింపులో, దేవుని పట్ల మనము స్వయంగా స్వామిభక్తి కలిగినవారముగా ఉండునట్లు యాకోబు జీవితము మనలను ప్రోత్సహిస్తూనే ఉంటుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

యాకోబుతో సహా మనకంటే ముందు వెళ్లినవారి యొక్క నమ్మకత్వమును మనము అనుకరించాలని ప్రోత్సహించు హెబ్రీ. 12:1-2 వంటి వాక్యభాగములు మనకు జ్ఞాపకము చేయబడతాయి.

మూడవదిగా, మానవ స్వామిభక్తిని కోరు యాకోబు వృత్తాంతములోని ప్రతి భాగము దేవుని రాజ్యము యొక్క నెరవేర్పులో క్రీస్తు పట్ల స్వామిభక్తిని కనుపరచునట్లు మన హృదయములను పురికొల్పాలి. క్రీస్తు అనుసరించు మనము ఒక దినమున దేవుని యొక్క పరిపూర్ణమైన, నమ్మకమైన సేవకులుగా మార్చబడతామని స్వామిభక్తి అను అంశము మనకు జ్ఞాపకము చేస్తుంది. 1 యోహాను 3:2 బోధించుచున్నట్లు, క్రీస్తు తిరిగివచ్చునప్పుడు, "మనము ఆయన వలె మారిపోతాము."

> యాకోబుకు దేవుని ఆశీర్వాదములు వాగ్దానము చేయబడినవి అని చూచుట ద్వారా నేడు మన జీవితములకు మనము యాకోబు వృత్తాంతములను అనువర్తించుకోగలము. యాకోబును దేవుడు ప్రేమించాడని దేవుని వాక్యము అతనికి వాగ్దానము చేసిందిగాని, యాకోబు దేవుడు అప్పటికే వాగ్దానము చేసిన దానిని ఏదో ఒక విధముగా పొందుకొనుటకు ప్రయత్నిస్తు తన జీవితములోని ఎక్కువ కాలమును గడిపివేశాడు. కాబట్టి, మనము చాలా సార్లు యాకోబును పోలియున్నాము. దేవుడు ఇప్పటికే మనకు వాగ్దానము చేసి, వాస్తవానికి, క్రీస్తులో మనకు ఇప్పటికే ఇచ్చిన వాటిని — ఏదో ఒక విధంగా సంపాదించుకొనుటకు — మనము ప్రయాస పడుతుంటాము. రోమా. 8:32 అంత స్పష్టముగా దీనిని గూర్చి బైబిలులో మరి ఏ వచనము కూడా మాట్లాడదు. "తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరికొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?" క్రీస్తు ద్వారా 46వ కీర్తనలోని మాటలను మనము విశేషముగా వినవచ్చు: "ఊరకుండుడి, నేనే దేవుడనని తెలిసికొనుడి," మరియు ఆయన మంచి దేవుడని, తన నిబంధనా పిల్లలపై దయచూపువాడని తెలుసుకొనుడి.
>
> — రెవ. మైఖేల్ జే. గ్లోడో

ఇశ్రాయేలుపై దేవుని కృప మరియు ఇశ్రాయేలు దేవునికి చూపిన స్వామిభక్తి అను ముఖ్య అంశములను చూశాము కాబట్టి, ఆదికాండము యొక్క ఈ భాగములోని మూడవ ప్రధానమైన అంశమును చూచుటకు ఇప్పుడు మనము సిద్ధముగా ఉన్నాము. ఇశ్రాయేలుకు దేవుని ఆశీర్వాదములు.

## ఇశ్రాయేలుకు దేవుని ఆశీర్వాదములు

మోషే యొక్క ఇతర అంశములను మనము చూసిన విధముగానే ఇశ్రాయేలుకు దేవుడిచ్చిన ఆశీర్వాదములను మనము పరీక్షించుదాము. మొదటిగా మోషే యొక్క వాస్తవిక అర్థమును చూద్దాము,



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

తరువాత ఈ అంశము యొక్క ఆధునిక అనువర్తనమును చూద్దాము. మోషే యొక్క వాస్తవిక అర్థముతో ఆరంభిద్దాము.

## వాస్తవిక అర్థము

సామాన్య పదములలో, తన ప్రజలతో దేవుని యొక్క నిబంధన అనుబంధములో విధేయతకు ఆశీర్వాదములు మరియు అవిధేయతకు శాపములు ఉన్నాయి. తన అవిధేయత కారణంగా యాకోబు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాడు అనుటకు ఎలాంటి సందేహము లేదు. ఉదాహరణకు, తన సహోదరుని మరియు తండ్రిని మోసము చేసిన తరువాత, యాకోబు తన ప్రాణమును కాపాడుకొనుటకు పరుగెత్తవలసివచ్చింది. తన మామయైన లాబాను నుండి కూడా అతడు కష్ట సమయమును ఎదుర్కొన్నాడు.

దేవుడు తన వాస్తవిక శ్రోతలకు కూడా అనేక ఆశీర్వాదములను ఇచ్చాడని వారికి జ్ఞాపకము చేయుటకు దేవుడు యాకోబుకిచ్చిన *ఆశీర్వాదముల* మీద మోషే ఎక్కువ ఉద్ఘాటనను పెట్టాడు. యాకోబు జీవితములో దేవుడిచ్చిన ఆశీర్వాదములను రెండు గుంపులుగా విభాగించవచ్చు: యాకోబు అవిధేయతలో కూడా ఇవ్వబడిన ఆశీర్వాదములు మరియు యాకోబు చూపిన విధేయత కొరకు ఇవ్వబడిన ఆశీర్వాదములు.

ఒక వైపున, యాకోబు చూపిన స్వామిద్రోహము తరువాత కూడా అతడు ఆశీర్వాదములను పొందుకున్నాడు. ఉదాహరణకు, ఆది. 27:27-29లో, యాకోబు ఇస్సాకును మోసము చేసినప్పటికీ ఇస్సాకు ద్వారా అతడు దేవుని ఆశీర్వాదమును పొందుకున్నాడు. యాకోబు ఏశావు నుండి తన ప్రాణమును కాపాడుకొనుటకు పరుగెత్తుచున్నప్పటికీ, 28:13-25లో బేతేలు యొద్ద అతడు దేవుని ఆశీర్వాదములను పొందుకున్నాడు.

మరొక వైపున, యాకోబు వృత్తాంతము యొక్క తరువాత విభాగములలో, యాకోబు చూపిన స్వామిభక్తికి స్పందనగా దేవుని ఆశీర్వాదములను అతడు పొందుకున్నాడు. ఉదాహరణకు, ఆది. 29:1-31:55లో, లాబాను ద్వారా దేవుడు యాకోబుకు కుటుంబము మరియు ఐశ్వర్యము అను ఆశీర్వాదములను ఇచ్చాడు. యాకోబు తనను తాను నమ్రపరచుకున్న తరువాత, ఆది. 32:1-33:17లో ఏశావు ద్వారా దేవుడు యాకోబుకు ఆశీర్వాదములను అనుగ్రహించాడు. అదే విధముగా, ఆది. 33:18-34:31లో, షెకెములో యాకోబు కుమారులు కనానీయులతో సంఘర్షించిన తరువాత యాకోబు దేవుని ఆశీర్వాదములను పొందుకున్నాడు. పితరుడు దేవుని ఆరాధించుటకు తనను తాను సమర్పించుకున్నప్పుడు 35:9-13లో బేతేలులో కూడా యాకోబుకు దేవుడు ఆశీర్వాదములను ఇచ్చాడు.

వాగ్దాన దేశము వైపుకు తనను వెంబడించుచున్న ఇశ్రాయేలీయులు నిర్గమములో మరియు స్వాధీనపరచుకొనుటలో అనేక సమస్యలను ఎదుర్కొంటారని మోషేకు ముందుగానే తెలుసు. కాబట్టి, ఇవి మరియు అనేక ఇతర లేఖన భాగములలో, తన వాస్తవిక శ్రోతలలో కృతజ్ఞతను ప్రేరేపించుటకు మరియు దేవుని ఆశీర్వాదములను మరి ఎక్కువగా వెదకమని వారిని ప్రోత్సహించుటకు దేవుడు యాకోబుకు ఇచ్చిన ఆశీర్వాదముల మీద మోషే దృష్టిపెట్టాడు. ఇశ్రాయేలుకు దేవుడిచ్చిన ఆశీర్వాదములు అను

అంశము యొక్క వాస్తవిక అర్థమును మనము చూసిన తరువాత, ఆధునిక అనువర్తనము కొరకు ఈ విషయముల యొక్క ప్రాముఖ్యతను అర్థము చేసుకొనుట అంత కష్టమనిపించదు.

### ఆధునిక అనువర్తనము

మనము ఇంతకు ముందు చేసిన చర్చను అనుసరిస్తు, మరొకసారి మనము క్రీస్తు రాజ్యము యొక్క ఆవిష్కృతము, కొనసాగింపు మరియు నెరవేర్పు దృష్ట్యా మాట్లాడదాము. రాజ్యము యొక్క ఆవిష్కృతములో స్వయంగా క్రీస్తు వైపుకు మన మనస్సులను మనము మళ్ళించాలి. యాకోబుకు భిన్నముగా, యేసు స్వామిద్రోహమును చూపి కూడా ఆశీర్వాదములను పొందలేదు; ఆయనలో అసలు ఏ పాపమును లేదు. కాని ఆయన తండ్రికి నమ్మకముగా ఉన్నాడు కాబట్టి, యేసు భూమి మీద నివసించినప్పుడు గొప్ప ఆశీర్వాదములను పొందాడు మరియు పరలోకమునకు ఎక్కి వెళ్లిన తరువాత మరిఎక్కువ ఆశీర్వాదములను పొందాడు. యేసు యొక్క సొంత ఆశీర్వాదములలో అత్యంత విశేషమైన విషయం ఏమిటంటే, ఎఫెసీ. 1:3 బోధించుచున్నట్లు, క్రీస్తుతో మన ఐక్యత ద్వారా, యేసు పొందిన ఆశీర్వాదములలో మనము పాలివారమైయున్నాము.

దీనికి తోడు, తన రాజ్యము యొక్క కొనసాగింపు అంతటిలో క్రీస్తు ఆయన ప్రజల మీద ఆశీర్వాదములను కుమ్మరిస్తాడని క్రొత్త నిబంధన బోధిస్తుంది. యాకోబు విషయములో ఆయన చేసినట్లే, కొన్ని సార్లు మనము అవిధేయత చూపినప్పటికీ, మరికొన్నిసార్లు స్వామిభక్తిని కనుపరుస్తు స్పందించినప్పుడు దేవుడు మనలను దీవిస్తాడు. ఇప్పుడు, క్రీస్తు అనుచరుల యొక్క జీవితము స్వయం-పరిత్యాగము మరియు శ్రమలతో నిండియుంటుంది. అయితే దేవుడు పరిశుద్ధాత్మ అను అద్భుతమైన ఆశీర్వాదము ద్వారా మనకు ముద్ర వేస్తాడని 2 కొరింథీ 1:21-22 మరియు ఎఫెసీ. 1:13-14 వంటి వాక్య భాగములు స్పష్టము చేస్తాయి. రానున్న లోకములో మనము పొందు మరింత ఉన్నతమైన స్వాస్థ్యమునకు సంచకరువుగా పరిశుద్ధాత్ముడు మనలో మరియు మన మధ్య నివసిస్తాడు.

కాబట్టి, మనము ఆదికాండములో యాకోబునకు ఇవ్వబడిన దేవుని ఆశీర్వాదములను చూసిన ప్రతిసారి, క్రీస్తు రాజ్య నేరవేర్పులో మనము పొందు లెక్కింపశక్యముకాని ఆశీర్వాదములను గూర్చి మనకు జ్ఞాపకము చేయబడుతుంది. మత్తయి 25:34 వంటి వాక్యభాగములు స్పష్టముగా బోధించుచున్నట్లు, క్రీస్తు తిరిగివచ్చినప్పుడు, “లోకము సృష్టించబడిన సమయము నుండి మన కొరకు సిద్ధపరచబడిన రాజ్యములోనికి” దేవుడు మనలను ఆహ్వానిస్తాడు.

ఇశ్రాయేలుకు దేవుడు చూపిన కృప, ఇశ్రాయేలు దేవునికి చూపిన స్వామిభక్తి, మరియు ఇశ్రాయేలుకు దేవుడిచ్చిన ఆశీర్వాదములు అను ప్రధానమైన అంశములను ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు నాల్గవ మరియు యాకోబు జీవితమును గూర్చి మోషే నివేదించిన అత్యంత ప్రాముఖ్యమైన అంశమును చూద్దాము: ఇశ్రాయేలు ద్వారా ఇతరులకు దేవుని ఆశీర్వాదములు.

## ఇశ్రాయేలు ద్వారా ఆశీర్వాదములు

ఇంతకు ముందు వలెనె, మోషే యొక్క వాస్తవిక అర్థము మరియు ఆధునిక అనువర్తనము దృష్ట్యా ఇశ్రాయేలు ద్వారా దేవుని ఆశీర్వాదములు అను అంశమును మనము విశదీకరిద్దాము. ముందుగా మోషే యొక్క వాస్తవిక అర్థమును చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## వాస్తవిక అర్థము

వాస్తవిక శ్రోతల కొరకు ఈ అంశము యొక్క ప్రాముఖ్యతను అర్థము చేసుకొనుటకు, ఇశ్రాయేలు దేశము యొక్క పితరునిగా అబ్రాహాముకు దేవుడిచ్చిన విశేషమైన పిలుపును మనము జ్ఞాపకము చేసుకోవాలి. మానవాళికి ఇవ్వబడిన వాస్తవిక ఆజ్ఞను నెరవేర్చుటలో నాయకత్వము వహించుటకు దేవుడు ఇశ్రాయేలు ప్రజలను ఆజ్ఞాపించాడని ఆదికాండములోని అబ్రాహాము వృత్తాంతము వివరిస్తుంది. వారు ఫలించి అభివృద్ధి పొంది నమ్మకమైన దేవుని స్వరూపములుగా భూమిని నింపవలసియుండెను. దేవుని ఆశీర్వాదములను భూమి మీద ఉన్న ప్రజలందరి మధ్య వ్యాపింపజేయుట ద్వారా ఒక విధంగా వారు దీనిని చేయవలసియుండెను. ఆది. 12:2-3లో మనము చదువునట్లు, దేవుడు అబ్రాహాముతో ఇలా సెలవిచ్చాడు:

> నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును (ఆది. 12:2-3).

దేవుని రాజ్య ఆశీర్వాదములను "భూమి యొక్క సమస్త వంశములకు" వ్యాపింపజేయుటకు దేవుడు అబ్రాహామును పిలిచిన విషయమును ఇక్కడ గమనించండి. కాని దేవుని ఆశీర్వాదములు భూమియందంతటా వ్యాపించినప్పటికీ, ప్రతి ఒక్కరు ఆశీర్వదించబడరు అను విషయమును కూడా గమనించండి. దేవుడు ఇలా సెలవిచ్చాడు: "నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను." మరొక మాటలో, కొందరు ఇశ్రాయేలు యొక్క ప్రయత్నములను తిరస్కరిస్తారు, మరికొందరు వాటిని అంగీకరిస్తారు. మరియు దేవుడు దీనికి అనుగుణంగా ప్రజలను ఆశీర్వదిస్తాను మరియు శపిస్తాను అని వాగ్దానము చేశాడు.

ఆసక్తికరముగా, అబ్రాహాముకు దేవుడు బయలుపరచిన అదే రెండింతల ఆశీర్వాదము మరియు శాపమును గూర్చిన ప్రక్రియ ఆది. 27:29లో ఇస్సాకు యాకోబును దీవించునప్పుడు కూడా పునరావృతమైయ్యింది.

> నిన్ను శపించువారు శపింపబడుదురు. నిన్ను దీవించువారు దీవింపబడుదురుగాక (ఆది. 27:29).

పితరుడు తన దినములలో అనేకమంది ప్రజలకు ఏ విధంగా స్పందించాడు అను విషయమును చర్చించుటకు మోషే యాకోబు జీవిత నివేదికలో ఎక్కువ సమయమును వెచ్చించాడు. మోషే దినములలో ఇశ్రాయేలీయులు ఎదుర్కొనిన ప్రజల సమూహములకు పితరులు వీరు. కాబట్టి, ఈ విధంగా, ఇశ్రాయేలు వారు ఒక్కొక్క గుంపుతో ఏ విధంగా వ్యవహరించాలో మోషే వారికి బోధించాడు. వారు యుద్ధము చేయాలా? లేక శాంతిని స్థాపించాలా?

ఉదాహరణకు, యాకోబును గూర్చిన వృత్తాంతములు వాగ్దాన దేశపు సరిహద్దుల లోపలే రెండు ప్రజల గుంపులతో వ్యవహరిస్తాయి.

ఒక వైపున, 33:18-35:15లో ఉన్న ఆరవ విభాగము యాకోబు మరియు కనానీయుల మధ్య జరిగిన సంఘర్షణలను గూర్చి నివేదిస్తుంది. "అమోరీయుల — కనానీయులకు మరొక పదము —



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అక్రమము సంపూర్ణమగునంత వరకు" దేవుడు ఇశ్రాయేలును ఐగుప్తు నుండి బయటకు తీసుకొనిరాడని ఆది. 15:16లో ఆయన స్పష్టము చేశాడు. రాహాబు వంటి కొన్ని మినహాయింపులు తప్ప, మోషే దినముల నాటికి కనానీయులు వాగ్దాన దేశమును ఎంతగా కలుషితము చేశారంటే వారందరినీ నాశనము చేయమని దేవుడు ఇశ్రాయేలుకు ఆజ్ఞ ఇచ్చాడు. కాబట్టి, యాకోబు షెకెము వాసులను ఓడించుటను గూర్చి మరియు ఇతర కనానీయుల నుండి దేవుడు యాకోబును భద్రపరచుటను గూర్చి మోషే నివేదించుట ఆశ్చర్యం కలిగించదు.

మరొక వైపు, 26:1-33లో ఉన్న యాకోబు జీవితము యొక్క రెండవ విభాగము ఇస్సాకు మరియు ఫిలిష్తీయుల మధ్య జరిగిన సంకర్షణలను గూర్చి తెలియజేస్తుంది. యాకోబు కనానీయులతో చేసిన సంఘర్షణలకు భిన్నముగా, ఇస్సాకు ఫిలిష్తీయులతో సమాధానమును కలిగియుండుట మీద ఈ విభాగము దృష్టిపెడుతుంది. దేవుడు ఇశ్రాయేలుకు వాగ్దానము చేసిన ప్రాంతములలో ఫిలిష్తీయులు నివసించారని యెహోషువ 13:1-5లో మనము నేర్చుకుంటాము. అయితే ఫిలిష్తీయులు కాఫ్తోర్ నుండి వచ్చిన సముద్రయానము చేయు ప్రజలని వారి పేరు సూచిస్తుంది. ఈ కారణము చేత, వారు కనానీయుల వలె వెంటనే దేవుని ఉగ్రతను అనుభవించలేదు. ఆది. 21:22-34లో అబ్రాహాము మరియు 26:26-33లో ఇస్సాకును గూర్చి ఇవ్వబడిన ఉదాహరణలు ఈ విషయమును సమర్థిస్తాయి. ఈ పితరులిరువురు ఫిలిష్తీయులతో సమాధాన ఒప్పందములను చేశారు. ఫలితంగా, మోషే దినములలో నివసించిన ఇశ్రాయేలీయులు ఫిలిష్తీయులతో సమాధానముగా నివసించుట ద్వారా అబ్రాహామును మరియు ఇస్సాకును అనుకరించవలసియుండెను. తరువాత తరములలో ఫిలిష్తీయులు సమాధానమును భంగపరచినప్పుడు మాత్రమే ఇశ్రాయేలు వారి మీద యుద్ధము చేసింది.

ఈ ఉదాహరణలు మాత్రమేగాక, యాకోబు వృత్తాంతము వాగ్దాన దేశమునకు వెలుపల నివసించిన ప్రజలతో కూడా వ్యవహరిస్తుంది. ఉదాహరణకు, 29:1-31:55లో యాకోబు లాబానుతో గడిపిన సమయమును వర్ణించు మధ్య భాగము వాగ్దాన దేశమునకు ఉత్తర దిక్కున పద్దనరాములో నివసించిన ఇశ్రాయేలీయుల యొక్క దూర బంధువుల మీద దృష్టిపెడుతుంది. అక్కడ యాకోబు గడిపిన సమయమును గూర్చిన నివేదిక లాబాను మరియు అతని కుటుంబము చూపిన మోసమునకు వ్యతిరేకముగా హెచ్చరిస్తుంది. కాని వారి మధ్య ఉన్న భౌగోళిక సరిహద్దును గౌరవిస్తు, ఒకరితో ఒకరు సమాధానము కలిగి జీవించాలని యాకోబు లాబానులు ఒప్పందము చేసుకొనినట్లు ఆది. 31:51-55 సూచిస్తుంది. కాబట్టి మోషేను అనుసరించిన ఇశ్రాయేలీయులు ఉత్తర దిక్కున ఉన్న తమ బంధువులతో సమాధానము కలిగియుండాలని ఇది స్పష్టము చేసింది. కొంత కాలము తరువాత మాత్రమే ఇశ్రాయేలు ఈ ప్రాంతమునకు దేవుని రాజ్యమును వ్యాపింపజేయవలసియుండెను.

వాగ్దాన దేశములో మరియు ఉత్తర దిక్కున నివసించిన ప్రజలతో వ్యవహరించుటతో పాటు, యాకోబు జీవిత వృత్తాంతములోని ఎక్కువ భాగము అతడు తన సహోదరుడైన ఏశావుతో చేసిన సంకర్షణల మీద దృష్టిపెడుతుంది. మనము ఇంతకు ముందు చూసినట్లు, యాకోబు ఏశావుల మధ్య జరిగిన సంకర్షణలు వాగ్దాన దేశము యొక్క దక్షిణ సరిహద్దులో శేయీరులో నివసించిన ఎదోమీయులతో ఇశ్రాయేలు చేసిన సంకర్షణలకు ముందస్తు సూచనగా ఉన్నదను సత్యమును ఆది. 25:19-34లో సహోదరులు మరియు దేశముల మధ్య సంఘర్షణ యొక్క ఆరంభము ఉద్ఘాటిస్తుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఆదికాండములోని వాస్తవిక శ్రోతలకు ఎదోము మరింత ప్రాముఖ్యమైనదిగా ఉండెను, ఎందుకంటే వాగ్దాన దేశము యొక్క దక్షిణ సరిహద్దున వారు ప్రయాణించుచుండగా ఎదోమీయుల వైరమును వారు ఎదుర్కొన్నారు. ఈ ప్రాంతములో ఉన్న ఇతరులతో యుద్ధము చేయమని దేవుడు ఇశ్రాయేలీయులకు సెలవిచ్చాడు, కాని ద్వితీ. 2:4-6 మరియు సంఖ్యా. 20:14-21లో, తమ బంధువులైన ఎదోమీయులతో సమాధానముతోను వినయముగాను వ్యవహరించమని మోషే ఇశ్రాయేలుకు విశేషముగా సూచించినట్లు మనము చూస్తాము.

యాకోబు దేవుని ఆశీర్వాదములను మోసముతో పొందుకున్నాడని యాకోబును గూర్చిన వృత్తాంతము ఇశ్రాయేలీయులకు జ్ఞాపకము చేసింది. మరియు యాకోబు ఏశావు ఎదుట తనను తాను నమ్రపరచుకున్న విషయమును కూడా అది తెలియజేసింది. అంతేగాక, యాకోబును గూర్చిన వృత్తాంతములు యాకోబు ఏశావు మరియు వారి వారసుల యొక్క సమాధానకరమైన భౌగోళిక విభజన మీద దృష్టిపెట్టాయి. మోషే కథనములోని ఈ కోణములు తనను అనుసరించుచున్న ఇశ్రాయేలీయులు ఎదోమీయులతో ఎలా వ్యవహరించాలో సూటిగా తెలియజేశాయి. చాలా కాలము తరువాత, ఎదోమీయులు ఇశ్రాయేలును ఇబ్బందిపెట్టినప్పుడు మాత్రమే ఇశ్రాయేలీయులు వారితో యుద్ధము చేశారు.

ఇశ్రాయేలు ద్వారా ఇతరులకు దేవుని ఆశీర్వాదములు యొక్క వాస్తవిక అర్థమును ఇప్పటి వరకు మనము చూశాము కాబట్టి, ఇప్పుడు ఈ అంశము యొక్క ఆధునిక అనువర్తనమును మనము చూద్దాము.

## ఆధునిక అనువర్తనము

ఈ అంశము మన జీవితముల కొరకు అనేక అంతర్భావములను కలిగియున్నది, కాని సౌకర్యముగా ఉండుటకు క్రీస్తు రాజ్యము యొక్క మూడు దశల మీద మరొకసారి మనము దృష్టిని పెడదాము. మొదటిగా, రాజ్యము యొక్క ఆవిష్కృతములో, ఇశ్రాయేలు రాజైన యేసు భూమి మీద ఉన్న ప్రజలందరి కొరకు దేవుని ఆశీర్వాదములను తీసుకొనివచ్చాడు. ఆయన యొక్క మొదటి రాకడలో, యేసు సాతానును మరియు దాని దయ్యపు సమూహములను ఓడించుటకు వచ్చాడని యోహాను 12:47-48 వంటి వాక్యభాగములు మనకు బోధిస్తాయి. కాని ఆయన భూమి మీద ఉన్న ప్రతి దేశముతో సమాధానమును కలిగియుండుటకు వచ్చాడు. యేసు, ఆయన అపొస్తలులు మరియు ప్రవక్తలు ప్రతిఘటనను ఎదుర్కొన్నారు, కాని సువార్తను ప్రకటించుట ద్వారా వారు దేవునితో సమాధానపడుటను ఓపికతో బోధించారు. సువార్తను తిరస్కరించువారి మీదికి అంత్య దినమున వచ్చు దేవుని తీర్పును గూర్చి కూడా వారు హెచ్చరించారు.

రెండవదిగా, క్రీస్తు రాజ్యము యొక్క కొనసాగింపులో, సంఘము యొక్క పరిచర్య ద్వారా దేవుని ఆశీర్వాదములు దేశములన్నిటి మీదికి వ్యాపించుట కొనసాగుతుంది. క్రీస్తు, ఆయన అపొస్తలులు మరియు ప్రవక్తల యొక్క ఉదాహరణను అనుసరిస్తు, దేశములను మోసము చేయు దుష్ట శక్తులకు విరోధముగా మనము నిలబడుచున్నాము. 2 కొరింథీ 5:20 వంటి వాక్యభాగములు తెలియజేయుచున్నట్లు, మనము "క్రీస్తు రాయబారులమై"యున్నాము. అంత్య దినమున దేవుని తీర్పును గూర్చి హెచ్చరిస్తూనే, లోకమంతటికి దేవునితో శాంతి మరియు సమాధానమును అందించుచున్నాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మూడవదిగా, ఇతరులతో యాకోబు చేసిన సంకర్షణలను క్రీస్తు రాజ్యము యొక్క సంపూర్ణత దృష్ట్యా మనము చూడాలి. పాత నిబంధన కాలములలో, తీర్పు తీర్చవలసిన సమయము ఆసన్నమైనదని దేవుడు తలంచినప్పుడు ఇశ్రాయేలు ఇతరులతో చేసిన సమాధాన ఒప్పందము విరమించబడేది. అదే విధముగా, క్రీస్తు మహిమలో తిరిగివచ్చినప్పుడు, క్రీస్తును మరియు ఆయన రాజ్యమును వ్యతిరేకించిన ప్రతివారి నుండి దేశములతో చేయబడిన సమాధాన ఒప్పందము విరమించబడుతుంది. ఆ సమయమందు, దుష్టులు దేవుని తీర్పును అనుభవిస్తారు, మరియు ప్రకటన 5:9-10 వంటి వాక్యభాగములు మనకు బోధించుచున్నట్లు, క్రీస్తును నమ్మిన భూమి యొక్క ప్రతి కోణములో ఉన్న ప్రజలు సార్వత్రిక దేవుని రాజ్యములోనికి ప్రవేశిస్తారు.

## ముగింపు

ఈ పాఠంలో, పితరుడైన యాకోబు జీవితమును ఆదికాండములో మోషే వివరించిన విధానమును మనము చూశాము. వాగ్దాన దేశము వైపుకు తనను వెంబడించిన ఇశ్రాయేలీయుల జీవితములను తాకు విధముగా మోషే యాకోబు జీవిత నివేదిక యొక్క నిర్మాణమును మరియు విషయములను నైపుణ్యముతో ఏ విధంగా అమర్చాడో మనము చూశాము. ఇశ్రాయేలుకు దేవుడు చూపిన కృప, ఇశ్రాయేలు దేవునికి చూపిన స్వామిభక్తి, ఇశ్రాయేలుకు దేవుని ఆశీర్వాదములు మరియు ఇశ్రాయేలు ద్వారా దేవుని ఆశీర్వాదములు అను మోషే యొక్క ప్రధాన అంశములు, మోషే దినములలోని ఇశ్రాయేలుకు ఆచరణాత్మక నడిపింపును ఇచ్చుట మాత్రమే గాక, నేడు దేవుని సేవించుచున్న క్రీస్తు అనుచరులను కూడా ఎలా నడిపించుచున్నాయో కూడా గుర్తించాము.

యాకోబును గూర్చిన వృత్తాంతము క్రీస్తునందు విశ్వాసముంచు వారందరి కొరకు ఒక అద్భుతమైన నిరీక్షణ వృత్తాంతముగా ఉన్నది. మోషే యొక్క వాస్తవిక శ్రోతలు తమ వైఫల్యములు మరియు విజయములతో వ్యవహరించుచుండగా ఇది మొట్టమొదటిగా వారికి సహాయపడింది. మరియు వారు వాగ్దాన దేశము వైపుకు ప్రయాణించుచుండగా ఇతరులతో ఏ విధంగా వ్యవహరించాలో వారికి తెలియజేసింది. నేడు మీ కొరకు, నా కొరకు కూడా అది ఇలాంటి సహాయమునే చేస్తుంది. యాకోబు జీవితము ద్వారా, ఏ ఒక్కరు కూడా దేవుని కృపకు అందనంత దూరముగా లేరని మనకు నిశ్చయత లభిస్తుంది. మరియు క్రీస్తుతో ఐక్యపరచబడినవారముగా, మనము ఎదుర్కొను అనేక వైఫల్యముల మధ్య కూడా, క్రీస్తు మహిమలో తిరిగివచ్చునంత వరకు దేవుని రాజ్యము యొక్క ఆశీర్వాదములను లోకమంతటా ఎలా వ్యాపింపజేయాలో యాకోబు నుండి మనము నేర్చుకోవచ్చు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.